సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శనివారం, 02.05.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 190
పేజీలు: 12 వెల: రూ. 5


## అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

మంత్రి పొంగులేటి



- హైదరాబాద్‌లో జర్నలిస్టుల హౌసింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు
- పెండింగ్‌లో ఉన్న ప్లాట్ల కేటాయింపుపై త్వరలో మార్గదర్శకాలు
- హౌసింగ్ సొసైటీలతో మంత్రి పొంగులేటి సమావేశం
- జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న మంత్రి

03



## కాళేశ్వరం చదరంగం

### రేవంత్ డబుల్ టార్గెట్!

### కాళేశ్వరం అక్రమాలపై సీఎం కొత్త వ్యూహం

- సీబీఐ విచారణతో బీఆర్ఎస్, బీజేపీపై డబుల్ టార్గెట్
- విజిలెన్స్ నివేదికలతో కేసుకు బలం చేకూర్చిన సర్కార్
- నేరుగా చర్యలకు బదులు కేంద్రంపై బాధ్యత మళ్లింపు
- 'మోదీ-కేసీఆర్ ఒక్కటే' ప్రచారానికి కాంగ్రెస్ ప్లాన్
- సీబీఐ మౌనం వెనుక రాజకీయ లెక్కలు?
- ఢిల్లీకి మంత్రుల బృందాన్ని పంపే ఆలోచనలో రేవంత్
- విచారణ ప్రారంభమైతే బీఆర్ఎస్‌కు భారీ దెబ్బ?
- రాజకీయంగా లాభం కోసం రేవంత్ యుద్ధతంత్రం

**ముద్ర డెస్క్ :**

తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ రాజకీయ వేడి పెరుగుతోంది. రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మితమైన ఈ భారీ సాగునీటి ప్రాజెక్టు ఇప్పుడు వివాదాల కేంద్రంగా మారగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై సరికొత్త రాజకీయ–న్యాయ వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. కేవలం విమర్శలు చేయడం లేదా రాజకీయ ఆరోపణలకే పరిమితం కాకుండా, వ్యవస్థాగత దర్యాప్తు ద్వారా నిజానిజాలు వెలికితీయాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ ప్రయోజనాలే కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగినట్లు ఆరోపణలు ఉన్న అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) విచారణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. అయితే సీబీఐ నుంచి ఇంకా స్పష్టమైన స్పందన రాకపోవడం రాజకీయంగా ఆసక్తికర పరిణామంగా మారింది. ఈ పరిస్థితిని తనకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నంలో రేవంత్ స్పష్టమవుతోంది.

న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటుంది. ముఖ్యంగా జస్టిస్ ఘోస్ కమిషన్ నివేదికను ప్రస్తావించకుండా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ విభాగం ఇచ్చిన ప్రాథమిక నివేదికలను ఆధారంగా చూపిస్తూ సీబీఐకి నిర్ధారించడం ద్వారా సాంకేతిక అడ్డంకులను అధిగమించే ప్రయత్నం చేసింది. ప్రాజెక్టులలో నిధుల మళ్లింపు, నిర్మాణ లోపాలు, వ్యయాల్లో అసాధారణ పెరుగుదల వంటి అంశాలు ప్రధానంగా మిగతా 02లో

## హరీష్ ఫోన్ కేసీఆర్ ట్యాప్ చేసి ఉండొచ్చు

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



- అప్పటి పరికరాలను కేసీఆర్ ఉపయోగిస్తున్నడు
- ఫోన్ ట్యాపింగ్ అవసరం కాంగ్రెస్ కు లేదు

02

## సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

ఉద్యోగ సంఘాలతో డిప్యూటీ సీఎం భట్టి భేటీ

02



## ప్రాణహిత-చేవెళ్ల పునరుద్ధరణ చర్యలు

### తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి ప్రణాళికలు

### మహారాష్ట్రలో ముంపు తగ్గింపునకు ప్రత్యామ్నాయ మార్గాలు

- ఐఐటీ, హైదరాబాద్ ఆర్వీ అసోసియేట్స్ నిపుణులతో ప్రత్యామ్నాయ అలైన్ మెంట్ల పరిశీలన
- ఎన్‌డీఎస్ఏ మార్గదర్శనం మేరకు మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్ కు మరమ్మతులు
- ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాలకు సాగునీరు
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ముద్ర, హైదరాబాద్:**

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తూ, మహారాష్ట్రతో సానుకూల చర్చలకు సాంకేతిక ప్రతిపాదనలు రూపొందిస్తోంది. ఈ నేపథ్యంలో ఐఐటీ హైదరాబాద్, ఆర్వీ అసోసియేట్స్ నిపుణులతో కలిసి అలైన్‌మెంట్‌ల పరిశీలిస్తున్నారు. మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో, ముంపు ప్రభావాన్ని తగ్గించే మార్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మహారాష్ట్ర భూభాగంతో పాటు చప్రాల అభయారణ్యంపై ప్రభావం తగ్గించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అవసరమైతే ముంపు బాధితులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మిగతా 02లో

## రైతు సమస్యలపై బీజేపీ పోరు

అన్నదాతలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాల్సిందే



- తాలు, తరుగు, తేమ లేకుండా వడ్లు కొంటామన్న హామీ సమాధి చేశారా?
- వడ్లకు బోనస్ హామీ అంతా ఉత్తిదేనా?
- సీఎం రేవంత్ కు కేంద్రమంత్రి బండి సంజయ్ లేఖ

03

## కార్మికుల కోసం లేబర్ అడ్డాలు

ముఖ్యమంత్రి చంద్రాబాబు నాయుడు

- మే డేను పురస్కరించుకొని శ్రమశక్తి పురస్కారాలు అందించిన సీఎం
- కార్మికుడి కష్టంలాగే రాష్ట్రాభివృద్ధికి శ్రమిస్తున్నాం
- ఏపీకి పునర్ వైభవం తెచ్చేలా సుపరిపాలన
- డిసెంబరు నాటికి బందరు పోర్టు పూర్తయ్యేలా కృషి
- కృష్ణా జిల్లా పమిడిముక్కల ప్రజావేదిక సభలో సీఎం

04



## ఫోన్ ట్యాపింగ్ పై త్వరలో రెండో ఛార్జ్‌షీట్

డీజీపీ సీవీ ఆనంద్

- కేసు దర్యాప్తు తుది దశకు చేరిందని డీజీపీ వెల్లడి
- పోలీసింగ్‌లో ఏఐ వినియోగంతో తెలంగాణను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దే లక్ష్యం

03



## కోర్టు అంటే లెక్కలేదా ?

పోలీస్ అధికారులపై హైకోర్టు సీరియస్

02

- వాహనాల సీజ్ పై మండిపాటు
- డీజీపీ, ట్రాఫిక్ అదనపు సీపీ, రవాణా శాఖ కమిషనర్‌లకు నోటీసులు

## కశ్మీర్‌పై పాక్ విష వ్యూహం

బహిర్గతమైన పాక్ కుట్ర

- పాక్ అధ్యక్షుడు అయ్యేందుకు సైన్యాధ్యక్షుడు మునీర్ కుట్ర
- పాకిస్తాన్ లోని రాజకీయ అలజడిని క్యాష్ చేసుకునేందుకు స్కెచ్
- కశ్మీర్ లో టెర్రర్ దాడులతో అశాంతి సృష్టించే ప్లాన్!
- పర్యాటకాన్ని లక్ష్యంగా కశ్మీర్‌లో ఉద్రిక్తత పెంచే యత్నం
- అప్రమత్తమైన భారత భద్రతా దళాలు
- 'మిషన్ జీరో టెర్రర్'తో చెక్ పెడుతున్న భారత సైన్యం!

**ముద్ర డెస్క్ :**

జమ్మూ కశ్మీర్‌లో అలజడి సృష్టించేందుకు పాకిస్థాన్ మరోసారి భారీ కుట్రకు తెరలేపినట్లు భారత నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెంచి లోయలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలను పాక్ రచిస్తున్నట్లు పక్కా సమాచారం అందినట్లు తెలుస్తోంది.

**పాక్ సైన్యాధ్యక్షుడి వ్యూహం.. అంతర్జాతీయ వేదికలపై భారత్‌ను బద్నాం చేసే కుట్ర**

నిఘా వర్గాల కథనం ప్రకారం.. ఈ మొత్తం కుట్ర వెనుక పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు జనరల్ ఆసిమ్ మునీర్ హస్తం ఉన్నట్లు అనుమానాలు బలపడుతున్నాయి. పాకిస్థాన్‌లో అంతర్గత రాజకీయ సంక్షోభం తారస్థాయికి చేరిన వేళ ప్రజల దృష్టిని మళ్లించేందుకు 'కశ్మీర్ కార్డు' వాడటం పాక్ సైన్యానికి అలవాటుగా మారింది. ముఖ్యంగా అమెరికా వంటి అగ్రరాజ్యాల దృష్టిని ఆకర్షించి కశ్మీర్ అంశాన్ని మళ్లీ అంతర్జాతీయీకరించాలనేది మిగతా 02లో





## సమగ్ర కార్యాచరణతో రావాలి


గుర్తింపు ఎన్నికలు.. విలీనంపై తేల్చేస్తాం

- పీఆర్సీ అంశాన్ని మేం పరిష్కరిస్తాం
- గాజులరామారంలో 100, బహదూర్‌గూడలో 150 ఎకరాల్లో బస్ టెర్మినళ్లు
- ఒక డ్రైవర్‌నూ ఉద్యోగం నుంచి తొలగించం
- ఉద్యోగులు, మేనేజ్‌మెంట్ మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలి

02

### ఇదీ AI ముద్ర

రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించడాన్ని ప్రశంసిస్తూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన ట్వీట్‌పై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఇది మనందరి విజయమని పేర్కొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

శనివారం 02.05.2026

www.mudranews.in | @mudranews



## రోజంతా హైడ్రేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వండి



దోసకాయ నీరు వంటి పానీయాలు శరీరాన్ని చల్లగా ఉంచి టాక్సిన్స్‌ను బయటకు పంపిస్తాయి. ఇది ఆకలి తగ్గించి సహజంగా బరువు తగ్గడంలో సహాయపడుతుంది.

## కాళేశ్వరం 'చదరంగం'..

(మొదటి పేజీ తరువాయి)


ప్రస్తావించబడ్డాయి.

ఇక రాజకీయంగా కూడా ఈ వ్యూహం బహుళ ప్రయోజనాలను అందించడం లేదు. రాష్ట్ర ప్రభు త్వం నేరుగా కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకుంటే, అది ప్రతిపక్షానికి సానుభూతి పెట్టే అవకాశం ఉందని రేవంత్ అంచనా వే స్తున్నారు. అందుకే ఈ వ్యవహారాన్ని కేంద్రానికి నెట్టడం ద్వారా బాధ్యతను ఢిల్లీపై మళ్లించారు.

నరేంద్ర మోడీ ప్రభుత్వంపై కూడా పరోక్ష ఒత్తిడి పెంచే ప్రయత్నం. ఒకవేళ సీబీఐ విచారణకు కేంద్రం ముందుకు రాకపోతే, 'మోదీ–కేసీఆర్ ఒక్కటే' అనే రాజకీయ నినాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం కాంగ్రెస్‌కు లభిస్తుంది. అదే సమయంలో విచారణకు అనుమతిచ్చి నా, ఆ క్రెడిట్ రేవంత్ ఖాతాలో పడే అవకాశం ఉంది. దీంతో రాష్ట్ర బీజేపీ కూడా పరిస్థితిని ఎదుర్కొంటోంది.

ఇక ముందుకు వెళ్లే దశలో రేవంత్ రెడ్డి మరింత దూకుడు ప్రదర్శించే సూచనలు కనిపిస్తున్నాయి. అవసరమైతే స్వయంగా సీబీఐ డైరెక్టర్‌ను కలవడం లేదా మంత్రుల బృందాన్ని ఢిల్లీకి పంపించడం ద్వారా ఈ వ్యవహారాన్ని వేగవంతం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ప్రాథమిక ఆధారాలను నేరుగా సీబీఐకి అందజేస్తుంది, విచారణ ప్రారంభం కావడం తప్పనిసరి చేసే ప్రయత్నం.

మొత్తం మీద కాళేశ్వరం మార్పు కేవలం అవినీతి ఆరోపణలకే పరిమితం చేయకుండా, రాజకీయ ఆయుధం దిశగా రేవంత్ అడుగులు వేస్తున్నారు. విచారణ జరుగుతుందా లేదా అన్నది పక్కన పెడితే కూడా, ఈ కేంద్రంపైకి మళ్లించడం ద్వారా రాజకీయ లాభం పొందాలన్న వ్యూహం కనిపిస్తోంది. ఈ యుద్ధతంత్రం విజయవంతమైతే, తెలంగాణ రాజకీయాల్లో మార్పునకు నాంది కావచ్చు.




## సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. శుక్రవారం సాయంత్రం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులతో ఆయన సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల విన్నపాలను సావధానంగా విన్న ఆయన, వారి సమస్యలపై సానుకూల హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధి ఉద్యోగులే అన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజల గడప వద్దకు చేరుతున్నాయంటే, అందులో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని ప్రశంసించారు.

**ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాల ధన్యవాదాలు**

గతంతో పోలిస్తే ప్రస్తుతం ఆర్థిక క్రమశిక్షణతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండటంపై సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు అందుతున్నాయని, దీనివల్ల వేలాది కుటుంబాలకు ఊరట లభిస్తోందని డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బెనిఫిట్స్ చెల్లించేందుకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.వెయ్యి కోట్లు కేటాయించడాన్ని హర్షం వ్యక్తం చేశారు. భేటీ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు ప్రధానంగా పీఆర్సీ, కరువు భత్యం, హెల్త్ కార్డ్స్ వంటి దీర్ఘకాలిక సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన.. ఈ అంశాలన్నింటినీ కేబినెట్ సబ్ కమిటీలో సమగ్రంగా చర్చించి త్వరలోనే ఉద్యోగులకు చెబుతామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. మీరు చెప్పిన కోర్కెలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. మీ సమస్యలు ఇతర అంశాలపై క్యాబినెట్ సబ్ కమిటీలు చర్చించనున్నట్లు తెలిపారు. త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈ సమావేశంలో టీజీఈజేఏసీ నేతలు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాస రావు, దేవరకొండ సైదులు, లచ్చిరెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు, వివిధ శాఖలకు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు లచ్చిరెడ్డి పాల్గొన్నారు

ఈ సమావేశంలో టీజీఈ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, వి.రాజశేఖర్ సెక్రటరీ జనరల్ టీజీఈ జేఏసీ భాగస్వామ్య ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కె.రామకృష్ణ, ఎస్.రాములు, బాణాల రాం రెడ్డి, పెంటయ్య, రామేష్ పాక, డా.నిర్మల, ఎండీ హబీబ్ మియా, కె.మహిపాల్ రెడ్డి, దర్శన్ గౌడ్, వి,బిక్షం, ఉపెందర్ రావు, ఎస్.రాబర్ట్ బ్రూస్, డా.ఏ.సైదులు, జే.బుచ్చయ్య, కె.కుమార స్వామి, ఎస్కే.హబీబ్ మియా, వెంకటేశం, వివేక్, మమత, క్రాంతి కుమార్, రవి, నరేందర్, స్వామి, దేవిక, రమేష్ పాల్గొన్నారు.



## కశ్మీర్‌పై పాక్ 'విష' వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

మునీర్ వ్యూహంగా కనిపిస్తోంది. తద్వారా అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రతిష్టను దెబ్బతీయాలని వారు భావిస్తున్నారు.

**టార్గెట్ పర్యాటకం.. ఆర్థికంగా దెబ్బకొట్టే ప్రయత్నం**

గత కొన్నేళ్లుగా జమ్మూ కశ్మీర్‌లో పర్యాటక రంగం అద్భుతమైన వృద్ధిని సాధిస్తోంది. రికార్డు స్థాయిలో పర్యాటకులు తరలివస్తుండటంతో స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడుతోంది. దీనిని సహించలేక పోతున్న పాక్ ప్రేరేపిత శక్తులు, పర్యాటక ప్రాంతాలే లక్ష్యంగా దాడులకు ప్రణాళికలు వేస్తున్నాయి. పర్యాటక ప్రాంతాల్లో చిన్నపాటి దాడుల ద్వారా సందర్శకులను భయభ్రాంతులకు గురిచేయడం. విదేశీ ఉగ్రవాదుల కంటే స్థానిక యువతను తప్పుదోవ పట్టించి 'లక్షిత దాడులు' చేయించడం. కశ్మీర్‌లో పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయని ప్రపంచ దేశాలకు చూపి, ట్రావెల్ అడ్వైజరీలను జారీ చేయించడం ద్వారా పర్యాటకాన్ని కుప్పకూల్చడం లక్ష్యంగా చేసుకున్నట్టు సమాచారం.

**భారత భద్రతా దళాల ఉక్కుపాదం**

పాకిస్థాన్ కుట్రలను తిప్పికొట్టేందుకు భారత భద్రతా దళాలు 'మిషన్ జీరో టెర్రర్' వ్యూహంతో ముందుకు వెళ్తున్నాయి. సరిహద్దుల వద్ద నిఘాను ముమ్మరం చేయడంతో పాటు, అత్యాధునిక టెక్నాలజీని వాడుతున్నారు. సరిహద్దు దాటి వచ్చే డ్రోన్లను కూల్చివేసేందుకు యాంటీ–డ్రోన్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ఉగ్రవాదుల రహస్య నెట్‌వర్క్‌లను ఛేదించేందుకు సైబర్ నిపుణులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అవసరమైతే మరిన్ని పారామిలిటరీ బలగాలను మోహరించేందుకు కేంద్ర హోం శాఖ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**ప్రభుత్వ హెచ్చరిక.. ప్రజల భాగస్వామ్యం**

కేంద్ర ప్రభుత్వం ఈ పరిణామాలను అత్యంత నిశితంగా పరిశీలిస్తోంది. స్థానిక ప్రజలు కూడా భద్రతా దళాలకు సహకరించాలని.. ఏదైనా అనుమానాస్పద వస్తువు లేదా వ్యక్తి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. పర్యాటకులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి రక్షణకు అన్ని చర్యలు తీసుకున్నామని ప్రభుత్వం భరోసా ఇస్తోంది.

మొత్తానికి అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న కశ్మీర్‌ను అస్థిరపరచాలని పాక్ చూస్తున్నప్పటికీ, భారత సైన్యం అప్రమత్తత ముందు వారి కుట్రలు పారడం కష్టమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. శాంతిని కాపాడటంలో భారత్ ఏమాత్రం వెనక్కి తగ్గబోదని ఈ చర్యల ద్వారా స్పష్టమవుతోంది.

## హరీష్ ఫోన్ కేసీఆర్ ట్యాప్ చేసి ఉండొచ్చు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఫోన్ ట్యాపింగ్ అవసరం ప్రతిపక్ష బీఆర్ఎస్ కు మాత్రమే ఉందని టీపీసీసీ చీఫ్ మ హేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. దాని అవసరం, అలవాటు తమ ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశా రు. గతంలో ప్రతిపక్ష నేతలు, సినీ తారల ఫోన్లను ట్యాప్ చేశారన్న ఆయ న.. అప్పటి పరికరాలను ఉపయోగించి హరీశ్ రావు ఫోన్‌ను స్వయం గా కేసీఆరే ట్యాప్ చేసి ఉంటారని సం చలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం గాంధీ భవన్‌లో ఆయన



మీడియాతో మాట్లాడారు. తమ పరిధిలోని సీసీ టీవీ కెమెరాలు, తాము వాడుతున్న ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు, ఫోన్లను పోలీసులు ట్యాప్ చేస్తున్నారంటూ మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లాల్లో నిర్వహించబోయే సభలపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందించా రు. ప్రస్తుతం బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకునే పనిలో ఉం దని సెటైర్లు వేశారు. కూతురు కవిత పెట్టిన వేరు కుంపటి కారణంగానే కేసీఆర్ తప్పని సరి పరిస్థితుల్లో ఫామ్‌హౌస్ నుంచి బయటకు వస్తున్నారని ఆరోపించా రు. వాటాల పంపకాల్లో తేడాలు రావడంతోనే కవిత కొత్త పార్టీ పెట్టిందని.. ఆమె అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము, ధైర్యం బీఆర్ఎస్ ముఖ్య నాయకులకు ఉందా అని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు.

## ప్రాణహిత-చేవెళ్ల పునరుద్ధరణకు చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాజెక్టు ద్వారా ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. తక్కువ వ్యయంతో, తక్కువ ఎత్తిపోతల అవసరంతో సాగునీరు అందించే విధానాన్ని అభివృద్ధి చేయాలని అధికారులు సూచించారు.

అదేవిధంగా కాళేశ్వరం ప్రాజెక్టులోని మెడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు అత్యవసర మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ పనులు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకత్వంలో కొనసాగనున్నాయి. ప్రాజెక్టు పూర్తయితే తక్కువ నిర్వహణ ఖర్చుతో విశ్వసనీయంగా సాగునీరు అందించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

## కోర్టు తీర్పు అంటే లెక్కలేదా?

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
పెండింగ్ చలాన్లు ఉన్నాయనే నెపంతో వాహనాలను సీజ్ చేయడాన్ని హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. గతంలో తాము ఇచ్చిన ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ వాహనాలను జప్తు చేయడంపై ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. పెండింగ్ చలాన్లు ఉన్నంత మాత్రాన వాహనాలను సీజ్ చేయకూడదని గతంలోనే హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఉత్తర్వులను ధిక్కరిస్తూ పోలీసులు వాహనాలను సీజ్ చేస్తున్నారని పేర్కొంటూ ఒక బాధితుడు హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. న్యాయస్థానం ఆదేశాలను అధికారులు ఉద్దేశపూర్వకంగానే ఉల్లంఘిస్తున్నారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు హోం శాఖ సెక్రటరీ, రాష్ట్ర డీజీపీ, ట్రాఫిక్ అదనపు సీపీ, రవాణా శాఖ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాహనాలను ఎందుకు సీజ్ చేస్తున్నారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అధికారుల వివరణ అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు కోర్టు తెలిపింది. ఈ కేసు తదుపరి విచారణను న్యాయస్థానం వచ్చే నెల 19వ తేదీకి వాయిదా వేసింది.

## సమగ్ర కార్యాచరణతో రండి



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీ మనుగడ, గౌరవం పెంపొందించి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలని కార్మిక సంఘాల నేతలకు సూచించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై సంఘాలు సమావేశమై స్పష్టమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి ఇవ్వాలని చెప్పారు. పీఆర్సీ అంశాన్ని ప్రభుత్వం పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఏర్పడిన బకాయిలు తమ కాలానికి చెందినవి కాకపోయినా వాటి చెల్లింపునకు కృషి చేస్తున్నామని తెలిపారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి రాజకీయాల ప్రభావం లేకుండా అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత నియామకాలు చేపట్టడంతో పాటు బస్సుల సంఖ్య పెంచామని, మహాలక్ష్మి పథకం వల్ల మహిళా ప్రయాణికులు పెరిగి ఆదాయం కూడా పెరిగిందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో బస్ టెర్మినల్స్ నిర్మాణానికి గాజుల రామారం, బహదూర్‌గూడలో భూములు కేటాయిస్తున్నామని తెలిపారు. డీజిల్ ఖర్చు తగ్గించేందుకు ఈవీ బస్సులపై దృష్టి పెట్టి, వెయ్యి ఈవీ బస్సులు తీసుకుని మెట్రో, ఎంఎంటీఎస్‌తో అనుసంధానం చేస్తామని చెప్పారు. అప్పుల పునర్వ్యవస్థీకరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.కార్మికులు–మేనేజ్‌మెంట్ మధ్య సుహృద్భావ వాతావరణం ఉండాలని, తరచూ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ, విశ్రాంత ఉద్యోగుల చెల్లింపులను రూ.1000 కోట్లకు పెంచినట్లు వెల్లడించారు.

ఆర్టీసీ సమస్యలను 100 శాతం పరిష్కరిస్తామని.. కార్మికులకు అండగా ప్రభుత్వం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. చిన్న చిన్న స్పర్ధలతో సంస్థకు నష్టం వాటిల్లే పనులు చేయకూడదని.. సంస్థ మనుగడ సాగిస్తేనే అందరికీ మేలు జరుగుతుందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా 3 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని, సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. సమ్మె కాలంలో వేతనం, కేసుల ఎత్తివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి, ఎమ్మెల్యే లు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కేఆర్ నాగరాజు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు ఏ.ఆర్.రెడ్డి, థామస్ రెడ్డి (తెలంగాణ మజ్దూర్ యూనియన్), అశ్వత్థామ రెడ్డి, శంకర్ (తెలంగాణ మజ్దూర్ యూనియన్ (రి)), వీరాంజనేయులు, వి.ఎస్.రావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), ఎస్.బాబు, ఈ.వెంకన్న (ఎంప్లాయీస్ యూనియన్), పి.కమల్ రెడ్డి, ఎండీ మౌలానా (నేషనల్ మజ్దూర్ యూనియన్), ఎంకే బోస్, బి.యాదగిరి (కార్మిక పరిషత్), జి.అబ్రహం, మొగుళ్ల రాజిరెడ్డి (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్), రాజిరెడ్డి, బి.యాదయ్య (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (రి), బి.మునిరాములు, కె.యాదయ్య (బహుజన కార్మిక యూనియన్), కె.సత్యనారాయణ, ఎండీ అక్బర్ అలీ (ఆర్టీసీ వర్కర్స్ యూనియన్), కె.మనోహర్‌రావు, ఈ.స్వామి కుమార్ (కార్మిక సంఘ్), పున్న హరికిషన్, గోవింద్ (సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్), డి.వి.కె.రావు, కె.హనుమంతు ముదిరాజ్ (తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్), దువ్వాసీ యాదయ్య, సుద్దాల సురేష్ (బహుజన్ వర్కర్స్ యూనియన్) పాల్గొన్నారు.

### ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా

## వల్లభనేని ప్రమాణ స్వీకారం

**ముద్ర హైదరాబాద్ :**
ఫిల్మ్ ఫెడరేషన్ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో విజయం సాధించిన వల్లభనేని అనీల్ కుమార్ ఈరోజు అధికారికంగా ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఫెడరేషన్ కార్యాలయం వద్ద ఉదయం జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. అదే సమయంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా పలువురు సినీ, కార్మిక సంఘాల ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, ఫెడరేషన్ అభివృద్ధికి అనీల్ కుమార్ నాయకత్వం ఎంతో దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన విజయం కార్మికుల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఫెడరేషన్ సభ్యుల సంక్షేమంకు



సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. తన ప్రసంగంలో అనీల్ కుమార్ మాట్లాడుతూ, సభ్యుల నమ్మకానికి తాను కృతజ్ఞతలు తెలుపుతూ, ఫెడరేషన్ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం తన ప్రాధాన్యమని స్పష్టం చేశారు.



## మాజీ డీజీపీకి చిక్కులు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
మాజీ డీజీపీ బి.శివధర్ రెడ్డి తాత్కాలిక నియామకం చట్టబద్ధమా, కాదా? అనే అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హైకోర్టు పేర్కొంది. ఈ విషయంలో శివధర్ రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు విన్న తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. డీజీపీగా శివధర్ రెడ్డి నియామకం సుప్రీంకోర్టు గత మార్గదర్శకాలకు అనుగుణంగా లేదని ధనగోపాల్ రావు అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. శివధర్ రెడ్డి నియామకాన్ని వెంటనే రద్దు చేయాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో కోర్టు శుక్రవారం ఈ కేసుపై విచారణ జరిపింది. దీంతో పాటు రాష్ట్రంలో పూర్తి స్థాయి డీజీపీ నియామకం అంశంపైనా హైకోర్టులో విచారణ జరిగింది. సీవీ ఆనంద్‌ను తెలంగాణకు రెగ్యులర్ డీజీపీగా నియమించినట్లు న్యాయస్థానానికి అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. పూర్తి స్థాయి డీజీపీ నియామకానికి సంబంధించిన జీవో ప్రతిని కోర్టుకు ఏజీ సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జీవోని పరిగణనలోకి తీసుకోవాలని విన్నవించారు. జీవో కాపీని పరిశీలించిన ధర్మాసనం.. సానుకూలంగా స్పందించింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 02-05-2026
www.mudranews.in | @mudranews




### భోజనం తర్వాత మజ్జిగ తప్పనిసరి

మజ్జిగలో ఉన్న ప్రోబయోటిక్స్ జీర్ణక్రియను మెరుగు పరుస్తాయి. కడుపు ఆరోగ్యంగా ఉండడం వల్ల ఫ్యాట్ నిల్వ తగ్గుతుంది.



## రైతు సమస్యలపై బీజేపీ పోరు



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలోని రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. అన్నదాతలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తూ ఆయన బహిరంగ లేఖ విడుదల చేశారు. వడ్లు తాలు, తరుగు, తేమ లేకుండా కొనుగోలు చేస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదని, బోనస్ చెల్లింపులు కూడా నిలిచిపోయాయని విమర్శించారు. పత్తి పంటకు కనీస మద్దతు ధర అమలు చేయక రైతులను నష్టపరిచారని ఆరోపించారు. మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యం వల్ల దళారులు లాభపడుతున్నారని పేర్కొన్నారు. అకాల వర్షాలతో భారీగా పంట నష్టం జరిగినప్పటికీ సరైన పరిహారం అందలేదని, ప్రకటించిన స్థాయిలో ఆర్థిక సాయం ఇవ్వలేదని విమర్శించారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో బీజేపీ తరఫున ఉద్యమాలు చేపడతామని బండి సంజయ్ హెచ్చరించారు.

## సురక్షిత సమాజాల దిశగా కీలక అడుగు

### –ఆర్‌డబ్ల్యుఏలు, హౌసింగ్ సొసైటీలకు మార్గదర్శక వర్క్‌షాప్




**ముద్ర, తెలంగాణ బ్యూరో:** హైదరాబాద్‌లో సురక్షిత సమాజాల నిర్మాణంపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన వర్క్‌షాప్ విజయవంతమైంది. నరెడ్కో తెలంగాణ చాప్టర్, ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసిఐ), యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (యు–ఫెర్వాస్) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. వర్క్‌షాప్‌లో చట్టబద్ధ పునరుద్ధరణలు, భద్రతా నిబంధనల అమలు, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్‌పై ప్రాయోగిక అవగాహన కల్పించారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల నేపథ్యంలో భద్రతా ప్రమాణాల పాటింపు అత్యవసరమని నిపుణులు పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, ఆర్‌డబ్ల్యుఏలు, ఫెసిలిటీ మేనేజర్లు పాల్గొన్న ఈ సమావేశంలో అగ్నిమాపక భద్రత, లిఫ్ట్ నిర్వహణ, పర్యావరణ నిబంధనలపై విస్తృతంగా చర్చించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు, కార్యకలాపాల నిలిపివేతతో పాటు ప్రాణహాని కూడా సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సామూహిక జీవనంలో బాధ్యత, పారదర్శకత, సమిష్టి భాగస్వామ్యం కీలకమని పేర్కొంటూ, ఆర్‌డబ్ల్యుఏలు భద్రతా వ్యవస్థల నిర్వహణలో చురుకుగా వ్యవహరించాలని సూచించారు.

### టెండర్ల పట్ల ప్రభుత్వ వైఖరిపై

## హరీశ్ రావు విమర్శలు



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖ ల్లో పిలిచిన టెండర్లపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో మొబిలైజేషన్ అడ్వాన్స్‌లను వ్యతిరేకించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు వాటిని ఎలా సమర్థిస్తున్నారని ప్రశ్నించారు. ప్రస్తుతం ఆర్ అండ్ బీలో 34, పంచాయతీ రాజ్‌లో 17 ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారని, ఒకే కంపెనీకి అనేక టెండర్లు దక్కే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఈ టెండర్లను వెంటనే రద్దు చేసి తిరిగి పిలవాలని, మొబిలైజేషన్ అడ్వాన్స్‌లను కూడా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎక్సెస్ టెండర్ల కారణంగా ప్రాజెక్టుల వ్యయం భారీగా పెరుగుతోందని పేర్కొంటూ, ఆర్ అండ్ బీ శాఖలో రూ.11 వేల కోట్ల పనులు రూ.15 వేల కోట్లకు, పంచాయతీ రాజ్‌లో రూ.6 వేల కోట్ల పనులు రూ.8 వేల కోట్లకు చేరుతున్నాయని విమర్శించారు. దీని వల్ల ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతోందన్నారు. కాంట్రాక్టర్లకు సావరిన్ గ్యారెంటీలు ఇవ్వడం వల్ల భారం చివరకు ప్రజలపైనే పడుతుందని, టెండర్ విధానంలో పారదర్శకత అవసరమని హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## వచ్చే ఎన్నికల నాటికి టీఆర్ఎస్ ఉండదు

### - ఎంపీ డీకే అరుణ



**ముద్ర, మహబూబ్‌నగర్:** వచ్చే ఎన్నికల నాటికి టీఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోతుందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ వ్యాఖ్యానించారు. కల్వకుంట్ల కవిత పార్టీ పరిస్థితి వైఎస్ షర్మిల పార్టీలా మారుతుందని, చివరకు ఇతర పార్టీలో విలీనం చేసే పరిస్థితి వస్తుందని ఆమె అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించిన ఆమె, మహిళా రిజర్వేషన్ల విషయంలో చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని, పశ్చిమ బెంగాల్‌లో కూడా పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు రానున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొనడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్ర మాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తారని చెప్పారు. సమ్మక్క–సారక్క గిరిజన విశ్వవిద్యాలయం పనుల ప్రారంభంతో పాటు జాతీయ రహదా రుల పనులను కూడా ప్రారంభిస్తారని వెల్లడించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేసిన డీకే అరుణ, బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రధాని పర్యటనతో రాష్ట్ర రాజకీయాల్లో మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వడగాలులపై హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్ విడుదల

- అప్రమత్తంగా ఉండాలి
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ముద్ర:** రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు, వడగాలుల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని రెవె న్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో జూన్ 15 వరకు అధిక ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందని పేర్కొంటూ, 20 విభాగాలతో కలిసి హీట్‌వేవ్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ స్టేట్ హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్–2026ను విడుదల చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో త్రాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, మోటార్లు దెబ్బతిన్నా 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. హైదరాబాద్‌లో రోజుకు 15 వేల ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కొనసాగుతున్నదని తెలిపారు. పంచాయతీరాజ్, మున్సిపల్, ఫైర్, హెల్త్ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగిన పక్షంలో 15 రోజుల్లో నివేదికలు సమర్పించాలని, బాధితులకు తక్షణ సాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వడగాలుల ప్రభావం అధికంగా ఉండే జిల్లాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు.

ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, బస్టాండ్లు, మార్కెట్లు, పర్యాటక కేంద్రాల్లో చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అధిక వేడి సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశించారు.

## జర్నలిస్టు హౌజింగ్ సొసైటీల జేఏసీ ఏర్పాటు దిశగా చర్యలు





**ముద్ర, హైదరాబాద్:** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సచివాలయంలో హౌజింగ్ సొసైటీల ప్రతినిధులతో సమావేశమై కీలక నిర్ణయాలు ప్రకటించారు. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి శుభవార్త అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చల అనంతరం సొసైటీల ప్రతినిధుల అభిప్రాయాలు సేకరించిన మంత్రి, నగరానికి దూర ప్రాంతాల్లో 300 గజాల స్థలం లేదా నగర పరిసరాల్లో 1600 చదరపు అడుగుల ఫ్లాట్ కేటాయింపుపై ఏకాభిప్రాయం ఏర్పడిందన్నారు. సమస్య పరిష్కారం కోసం గరిష్టంగా 9 మంది సభ్యులతో జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేయాలని సూచించారు. సొసైటీల అభిప్రాయాలతో విజ్ఞాపన పత్రం సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని, దాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఉపసంఘానికి పంపనున్నట్లు వెల్లడించారు. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు సొసైటీ భూములపై సుప్రీంకోర్టు తీర్పుతో గత కేటాయింపులు రద్దయ్యాయని, అయినప్పటికీ సభ్యులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి హామీ ఇచ్చారు.

### అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

అర్హులైన జర్నలిస్టులందరికీ హైదరాబాద్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించాలనే దిశగా ప్రభుత్వం సానుకూలంగా ఉందని పేర్కొంటూ, పెండింగ్ సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార శాఖ కమిషనర్ ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్డు సేఫ్టీ బ్యూరో ఏర్పాటు



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో రోడ్డు భద్రతను పెంపొందించి వాహనదారులకు సాఫీ ప్రయాణం కల్పించేందుకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్డు సేఫ్టీ బ్యూరోను ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల్లో సుమారు 7,500 మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బ్యూరోను ఏర్పాటు చేసి, ఈగల్ మరియు సైబర్ క్రైమ్ బ్యూరో తరహాలో పనిచేయించనున్నట్లు తెలిపారు. ఒక అధికారిని హెచ్ఓడీగా నియమించి, అవసరమైన సిబ్బందిని కేటాయించనున్నట్లు చెప్పారు. ఈ బ్యూరో జిల్లా ఎస్పీలు, కమిషనరేట్లతో సమన్వయంతో పనిచేస్తుందని వివరించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న హాట్‌స్పాట్‌లను గుర్తించి, ఇంజనీరింగ్ లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలను ఒకే విధంగా అమలు చేయడంపై దృష్టి సారిస్తామని, ఫుట్‌పాత్ ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రతి రోజు భారీగా కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాంకేతికతను వినియోగించనున్నట్లు తెలిపారు. డ్రోన్ల సహాయంతో ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరచి, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటామని డీజీపీ వెల్లడించారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలో రెండో ఛార్జ్‌షీట్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. త్వరలోనే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) రెండో ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేయనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణ పోలీసింగ్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలపడం లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొంటూ, పోలీసింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని విస్తృతంగా పెంచుతామని చెప్పారు. మహిళల భద్రత, మానవ అక్రమ రవాణా, డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు జిల్లాల ఎస్పీలు చురుకుగా పనిచేయాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అలాగే గ్రేహౌండ్స్, ఎస్ఐబీ వంటి ప్రత్యేక విభాగాలను సమర్థవంతంగా వినియోగిస్తామని డీజీపీ స్పష్టం చేశారు.



## సందర్భానుసారంగా మాట్లాడటం నేర్చుకో..

### - కేటీఆర్‌కు అద్దంకి దయాకర్ సూచన

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** మేడే సందర్భంగా కార్మికుల సమస్యలపై మాట్లాడాల్సిన సమయంలో అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, కేటీఆర్‌పై విమర్శలు గుప్పించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, సందర్భానుసారంగా స్పందించడం నేర్చుకోవాలని సూచించారు. మూడేళ్లలో సీఎం పని చేయలేదని విమర్శించడం తగదని, పదేళ్ల పాలనలో చేసిన పనులపై కూడా ఆత్మపరిశీలన అవసరమని అన్నారు. కార్మిక సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలు, ముఖ్యంగా గిగ్ వర్కర్లకు సంబంధించిన చర్యలపై అవగాహన లేకుండా విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. కేవలం విమర్శల ద్వారానే పార్టీని ముందుకు తీసుకెళ్లాలనే ప్రయత్నం దురదృష్టకరమని, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. సీఎం రేవంత్ రెడ్డి ఎదుగుదలను అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే విమర్శలు చేస్తున్నారని అద్దంకి దయాకర్ ఆరోపించారు.

## జిల్లాలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి..

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** వేసవి తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో జిల్లాలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. వేసవికాలంలో తాగునీటి సరఫరాపై జిల్లా సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడైనా ప్రజలకు ఇబ్బం దులు ఎదురైతే, అధికారులు స్పం దించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ డబ్ల్యూ ఎస్ ఈఈ సందీప్, డిపిఓ శ్రీనివాస్, జడ్పి సీఈవో భాగ్యలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో మరింత భారం

### - మంత్రి ఉత్తమ్ కుమార్



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** కేంద్రప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ ధర పెంచడంపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇది సామాన్యుడిపై పెనుభారం మోపే నిర్ణయం అని దుయ్యబట్టారు.19 కేజీల గ్యాస్ ధర రూ. 993కు పెంచడం పై శుక్రవారం ఆయన తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఒక్కసారిగా 30 నుండి 35 శాతం పెంచడంతో హోటళ్లు, కేఫ్ లు రెస్టారెంట్లతో సహా చిన్న తరహా వీధి వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన 24 గంటలు పూర్తి కాగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన ఎద్దేవా చేశారు. ముమ్మాటికీ ఇది ప్రజలను మోసం చేసేందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని పచ్చిమ బెంగాల్ ఎన్నికలు పూర్తి కాంగానే కమర్షియల్ గ్యాస్ ధర పెంచడం అంటే సామాన్యులను మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. కేంద్రం పెంచిన ధరలతో 19 కేజీల గ్యాస్ ధర మూడువేలకు మించి పోయిందన్నారు. కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో సామాన్యుల జీవన ప్రమాణాలపై కోలుకోలేని దెబ్బపడుతుందని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ఈతకు వెళ్లిన ఇద్దరి మృతి





**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. నర్సాపూర్ జి మండల కేంద్రానికి చెందిన రిజ్వాన్, అశ్వాక్ లు సుద్దవాగులో ఈతకు వెళ్లారు. అయితే లోతు తెలియక నీటిలో మునిగిపోయారు. ఎంతసేపటికీ రాకపోవటంతో వారికోసం వెళ్లిన వారికి వారి దుస్తులు కనిపించాయి. దీంతో శవాలను సాయంత్రం వెలికి తీశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 02.05.2026
www.mudranews.in | @mudranews



రోజుకు కనీసం 2–3 లీటర్ల నీరు తాగండి
శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటే మెటాబాలిజం సరిగ్గా పనిచేస్తుంది.ఇది కొవ్వు నిల్వను తగ్గించడంలో కీలకం.



## ఎడిటోరియల్

### విశ్రాంత జీవితం: మూడు మజిలీల ప్రయాణం



రిటైర్ అయిన రాఘవరావు గారికి 60 ఏళ్ళు. 35 ఏళ్ళు బ్యాంకు మేనేజర్‌గా పనిచేసి, వందల మందికి సంతకం పెడితేనే పని జరిగేది. రిటైర్మెంట్ రోజు ఘనంగా సన్మానం చేసి పంపారు. మర్నాడు బ్యాంకుకు వెళ్తే, సెక్యూరిటీ "సార్, ఎవర్ని కలవాలి?" అని అడిగాడు. క్యాబిన్‌లో ఇంకెవరో కూర్చున్నారు. అప్పుడు అర్థమైంది రాఘవరావుకి ఇది మొదటి దశ. 60 నుండి 64 వరకు, నువ్వు ఎంత గొప్పవాడివైనా ఆఫీసు నిన్ను మర్చిపోతుంది. "నేను మేనేజర్‌ని" అనే గర్వం విడిచిపెట్టాలి. ఇప్పుడు నువ్వు ఒక సాధారణ మనిషివి.

కాలం గడిచింది. రాఘవరావుకి 67. ఒకరోజు మార్కెట్లో పాత కొలీగ్ కనిపించాడు. పలకరిద్దామని దగ్గరకు వెళ్తే, అతను గుర్తుపట్టలేదు. "సార్, మీరు...?" అని అడిగాడు. ఫోన్‌లో నంబర్లున్నాయి కానీ ఎవరూ కాల్ చేయరు. పాత మిత్రులంతా వాళ్ళ పనుల్లో, కొందరు ఊరు కాని ఊరిలో. ఇది రెండో దశ. 65 నుండి 71 వరకు సమాజం నెమ్మదిగా దూరం జరుగుతుంది. "నేను అప్పుడు అది చేశాను" అని చెప్పినా వినేవాళ్ళు ఉండరు. కొత్త తరానికి నువ్వు తెలియదు. బాధపడితే నష్టం నీకే.

ఇప్పుడు రాఘవరావుకి 74. కొడుకు అమెరికాలో, కూతురు చెన్నైలో. పండక్కో, పబ్బానికో వీడియో కాల్. మనవడు "తాతయ్యా, బై" అని రెండు నిమిషాల్లో పెట్టేస్తాడు. ఇంట్లో భార్యతోనే కబుర్లు. ఇద్దరూ ఉదయం వాకింగ్, సాయంత్రం గుడి. ఇది మూడో దశ. 74 దాటాక కుటుంబం కూడా వాళ్ళ జీవితంలో బిజీ. వస్తే చాలు, వాళ్ళ ప్రేమకు అదే గుర్తు. రాలేదని అలగకూడదు. వాళ్ళకూ బరువులున్నాయి.

త77 దాటాక? రాఘవరావు అద్దంలో చూసుకున్నాడు. ముడతలు, తెల్ల జుట్టు. నిన్న తనతో క్యారమ్స్ ఆడిన స్నేహితుడు ఇవాళ లేడు. అనిపించింది. ఈ భూమి కూడా "వెళ్ళిపో" అంటోందేమో. కానీ భయం వేయలేదు. ఇది ప్రకృతి ధర్మం. వచ్చిన వాళ్ళంతా వెళ్ళిపోయారు, మనమూ వెళ్ళాలి. తెర పడే లోపు ఆట ఆడేయాలి.

ఆరోజు నుంచి రాఘవరావు మారిపోయాడు. ఉదయం 6కి లేచి పార్క్‌లో నవ్వుల క్లబ్. పాత స్నేహితులతో వారానికోసారి టిఫిన్. మనవడికి ఉత్తరాలు రాస్తాడు. భార్యకు ఇష్టమైన గులాబీ జామున్ తినిపిస్తాడు. షుగర్ ఉన్నా, ఒక్కటి తింటే ఏమవుతుంది? ఫోన్ తీసి రిటైర్డ్ ఫ్రెండ్స్‌కి కాల్: "ఒరే, బతికే ఉన్నావా?" అని నవ్వుతాడు.

ఎందుకంటే రాఘవరావుకి ఇప్పుడు తెలిసింది .. జీవితం ఒక్కసారే. గత హోదా లేదు, రేపటి గ్యారంటీ లేదు. ఉన్నది ఈ క్షణమే. ఆరోగ్యం ఉన్నంత వరకు, నచ్చింది తినాలి, నచ్చింది చేయాలి, నవ్వాలి, నవ్వించాలి.

**మిత్రులారా, మీరూ రాఘవరావు లాంటి వారే.**

**కలుస్తూ ఉండండి. ఫోన్ చేయండి. పాత జ్ఞాపకాలు తవ్వుకోండి.**

**వయసు ఒక నెంబరే. సంతోషం మాత్రం మన చేతిలోనే.**

**ఈ సత్యాన్ని ఎవరో రాశారు. పేరు తెలియదు కానీ, ఆ మనిషికి శతకోటి వందనాలు.**

# కార్మికుల కోసం ఇక లేబర్ అడ్డాలు

- ఏపీకి పునర్ వైభవం తెచ్చేలా సుపరిపాలన
- డిసెంబరు నాటికి బందరు పోర్టు పూర్తయ్యేలా కృషి
- పోలవరంతో కృష్ణా డెల్టాకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు
- విద్యావ్యవస్థలో సంస్కరణలతో పదో తరగతిలో మెరుగైన ఫలితాలు
- కృష్ణా జిల్లా పమిడిముక్కల ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- మే డేను పురస్కరించుకుని శ్రమశక్తి పురస్కారాలు అందించిన సీఎం



**ముద్ర , అమరావతి :** పామర్రు సమీపంలోని పమిడిముక్కల ప్రజావేదికలో జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్మికుల సంక్షేమంపై కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 15 నగరాలు, పట్టణాల్లో "లేబర్ అడ్డాలు" ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాలను భవిష్యత్తులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా అభివృద్ధి చేసి, పని లేని రోజుల్లో కార్మికులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.మే డే సందర్భంగా ఉత్తమ కార్మికులు, యాజమాన్యాలకు "శ్రమశక్తి పురస్కారాలు" అందజేసిన సీఎం, కార్మికుల సంక్షేమ పథకాలకు కొత్త ఊపునిచ్చామని పేర్కొన్నారు. వివాహ సహాయం, సంతానం పుట్టినప్పుడు ఆర్థిక సాయం, మరణానంతర సహాయాలు వంటి పథకాల ద్వారా కార్మికులకు భరోసా కల్పిస్తున్నామని వివరించారు.రాష్ట్ర అభివృద్ధిపై మాట్లాడుతూ, డిసెంబర్ నాటికి మచిలీపట్నం (బందరు) పోర్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసి, కృష్ణా డెల్టాకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యా రంగంలో సంస్కరణలతో పదో తరగతి ఫలితాలు మెరుగుపడ్డాయని కూడా పేర్కొన్నారు.ప్రజా ప్రభుత్వంగా పారదర్శక పాలన అందిస్తూ, రాష్ట్ర పునర్నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని సీఎం స్పష్టం చేశారు.

# చనిపోయిన వారి పాడె మోయడం శుభమా అశుభమా?

గరుడ పురాణం ప్రకారం, ఈ ప్రక్రియ కేవలం భౌతిక బరువును మోయడం కాదు. అది మనిషి జీవితకాల కర్మాచరణను, వారి పాపాలను, తీరని కోరికల భారాన్ని భుజాలపై మోయడం వంటిది. మృతదేహం లోపల మృత్యుశక్తి ఉంటుందని, పాడెను మోసేవారి ప్రాణశక్తితో స్పర్శలోకి వచ్చినప్పుడు ఒక అదృశ్య శక్తి మార్పిడి జరుగుతుందని పురాణాలు చెబుతున్నాయి...దీని ప్రభావం వల్ల స్మశానం నుండి వచ్చిన తర్వాత చాలామందికి జ్వరం రావడం లేదా తీవ్రమైన అలసట అనిపించడం సర్వ సాధారణం. ఇది సాధారణ అలసట కాదు, మృత్యుశక్తి ప్రాణశక్తిని పీల్చుకోవడం వల్ల కలిగే ప్రభావం...

### వెయ్యి యాగాల ఫలం

భగవంతుడైన విష్ణువు గరుడ పురాణంలో, దిక్కులేని అనాథ శవాన్ని తన భుజాలపై మోసిన వారికి వెయ్యి యాగాలకు సమానమైన ఫలితం దక్కుతుందని పేర్కొన్నారు...

### పాడెను మోసేటప్పుడు నియమాలు

పాడెను మోసేటప్పుడు కొన్ని నియమాలను పాటించడం అవశ్యం. భుజం మార్చేటప్పుడు ఎప్పుడూ బేసి సంఖ్యలో అడుగులు నడిచిన తర్వాతే మార్చాలి. మనస్సులో ప్రాపంచిక ఆలోచనలు, వ్యాపార విషయాలు, ఫోన్ సంభాషణలు లేదా నవ్వులాటలు ఉండకూడదు. ఇటువంటి చర్యలు ఆత్మను అవమానించడమే అవుతుంది, ఇది దీవెనలను శాపంగా మార్చగలదు...

### గరుడ పురాణం హెచ్చరిక

పాడెను మోస్తూ వేసే ప్రతి అడుగుకు ఒక అశ్వమేధ యాగం చేసినంత పుణ్యం లభిస్తుందని నమ్మకం. ఇది ఒక ప్రాయశ్చిత్తం లాంటిది; ఒకరి భారాన్ని మోస్తే భగవంతుడు మన జీవిత భారాన్ని తేలిక చేస్తాడు. బీడీలు, సిగరెట్లు త్రాగడం లేదా పాన్ నమలడం వంటివి మహా పాపాలు, యమధర్మరాజు అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తారని గరుడ పురాణం హెచ్చరిస్తోంది...

### సాక్షాత్తు పరమశివుని హస్తం

సాధారణంగా శవం తల ముందు వైపు ఉంటుంది. అయితే స్మశాన ద్వారం దగ్గరకు రాగానే కాళ్ళను ముందు వైపుకు మారుస్తారు. ఇది ఆత్మకు "మీ ప్రయాణం ముగిసింది, ఇక పరలోకం వైపు చూడు" అని మార్గనిర్దేశం చేసినట్లు అవుతుంది. తండ్రి లేదా సోదరుడి పాడెను మోయడం అనేది రుణం తీర్చుకోవడం వంటిది కాగా, అపరిచితుడిని మోయడం కేవలం కరుణతో కూడిన పుణ్యకార్యం. అనాథ శవానికి భుజం ఇచ్చే వారి తలపైన సాక్షాత్తు పరమశివుని హస్తం ఉంటుందని నమ్మకం.

### స్మశానం నుండి వచ్చిన తర్వాత..

స్మశానం నుండి వచ్చిన తర్వాత పూర్తి శుద్ధీకరణ తప్పనిసరి. కేవలం కాళ్ళు చేతులు కడుక్కోవడం సరిపోదు. ధరించిన బట్టలతో సహా స్నానం (సచైల స్నానం) ఆచరించాలి. ఆ తర్వాత వేపాకు నమలడం, ఇనుమును తాకడం, అగ్నిని దర్శించడం ద్వారా మృత్యులోకపు శక్తి నుండి విముక్తి పొంది తిరిగి జీవలోకంలోకి ప్రవేశిస్తారు. గరుడ పురాణం ప్రకారం, పాడెను మోయడం ప్రధానంగా పురుషుల బాధ్యత. ఇది వివక్ష కాదు, రక్షణ. మహిళల శరీరం, మనస్సు సున్నితంగా ఉంటాయి, స్మశానంలోని నకారాత్మక శక్తులు వారిపై త్వరగా ప్రభావం చూపుతాయి. అయితే, కుమారులు లేని పక్షంలో కుమార్తెలు మోయడం తప్పు కాదు, కానీ వారు శుద్ధీకరణ నియమాలను కఠినంగా పాటించాలి.

### ఆ ఆత్మలు అసంతృప్తితో..

ఆత్మహత్య లేదా ప్రమాదాల వల్ల మరణించిన శవాన్ని మోసేటప్పుడు అది బరువుగా అనిపిస్తుంది, ఎందుకంటే ఆ ఆత్మలు అసంతృప్తితో ఉంటాయి. అటువంటి సమయంలో గాయత్రీ మంత్రం లేదా మహామృత్యుంజయ మంత్రం జపించడం రక్షణ కవచంలా పనిచేస్తుంది. కలలో మరణించిన వ్యక్తి ప్రశాంతంగా కనిపిస్తే మీ సేవ అంగీకరించబడినట్లు. ఒకవేళ వారు ఏడుస్తున్నట్లు కనిపిస్తే, వారి పేరుమీద అన్న దానం చేయడం లేదా భగవద్గీతలోని ఏడవ అధ్యాయాన్ని పఠించడం మంచిది. జీవితం నశ్వరమైనది, కానీ మనం చేసే కర్మలు అమరమైనవి. మంచి కర్మలు చేయండి.

# ఐపీఎల్ రూల్స్ మార్చాల్సిందేనా?

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**



- ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుసగా భారీ స్కోర్లు
- ఐపీఎల్ నిబంధనల్లో మార్పులు తప్పనిసరి అంటున్న కైఫ్

ఐపీఎల్ 2026 సీజన్‌లో మ్యాచ్‌ల తరహా పూర్తిగా బ్యాటర్ల ఆధిపత్యంగా మారిపోతుండటంపై మాజీ భారత క్రికెటర్ మొహమ్మద్ కైఫ్ ఆందోళన వ్యక్తం చేశాడు. వరుసగా జట్లు భారీ స్కోర్లు నమోదు చేస్తుండటంతో బౌలర్లపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని, ఈ పరిస్థితిని సరిచేయాలంటే టోర్నీ నిబంధనల్లో మార్పులు తప్పనిసరిగా చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ వంటి జట్లు భారీ స్కోర్లతో ప్రత్యర్థులపై దూసుకెళ్తున్నాయి. 250కి పైగా పరుగులు కూడా సాధారణంగా మారుతున్న వేళ బౌలర్ల పాత్ర క్రమంగా కష్టసాధ్యమవుతోందని కైఫ్ పేర్కొన్నాడు. మొదటి ప్రధాన మార్పుగా అన్ని స్టేడియాల్లో బౌండరీల పరిమాణాన్ని సమానంగా ఉంచాలని సూచిం చాడు. కొన్ని మైదానాల్లో చిన్న బౌండరీలు ఉండటం వల్ల బ్యాటర్లు సులభంగా సిక్సర్లు బాదుతున్నారని, దీంతో సాధారణ స్కోర్లు కూడా రక్షించలేని పరిస్థితి వస్తోందని చెప్పాడు. 150 నుంచి 170 పరుగుల లక్ష్యాలు కూడా సురక్షితంగా లేకపోవడం బౌలర్లకు తీవ్ర అన్యాయమని అభిప్రాయపడ్డాడు. కాబట్టి పెద్ద బౌండరీలు ఉంటే బౌలర్లకు పోటీతత్వం పెరుగుతుందని సూచించాడు. రెండో కీలక అంశంగా ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను తొలగించాలని కైఫ్ డిమాండ్ చేశాడు. ఈ నిబంధన కారణంగా జట్లు అదనపు బ్యాటర్‌ను ఉపయోగించుకుని మరింత దూకుడుగా ఆడే అవకాశాన్ని పొందుతున్నాయని, ఫలితంగా బౌలర్ల ప్రాధాన్యం తగ్గిపోతోందని చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ రూల్ లేకపోవడం కూడా దాని ప్రాముఖ్యతపై సందేహాలు పెంచుతోందని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ మరింత సమతుల్యమైన టోర్నీగా మారాలంటే బ్యాటింగ్‌కు మాత్రమే కాకుండా బౌలింగ్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఉండాలని కైఫ్ స్పష్టం చేశాడు. ఇప్పుడు అతని సూచనలపై బీసీసీఐ స్పందిస్తుందా.. భవిష్యత్ సీజన్లలో మార్పులు తీసుకువస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.


# బాబర్ బ్లాస్ట్.. కోహ్లీ రికార్డులకు సవాల్!

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ మరోసారి తన క్లాస్‌ను నిరూపించాడు. బాబర్–విరాట్ కోహ్లీ పోలికలు ఎప్పుడూ క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగానే ఉంటాయి. ఇప్పుడు మరో అద్భుత ఇన్నింగ్స్‌తో బాబర్ తన పేరు మళ్లీ రికార్డుల పుస్తకాల్లో నిలిపాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్ క్వాలిఫైయర్ మ్యాచ్‌లో ఇస్లామాబాద్ యునైటెడ్‌పై అద్భుత శతకంతో పెషావర్ జల్మీని ఫైనల్‌కు చేర్చుతూ కెప్టెన్‌గా అసలైన నాయకత్వాన్ని చూపించాడు. కీలకమైన ఈ మ్యాచ్‌లో బాబర్ ఒత్తిడిని ఏమాత్రం పట్టించుకోకుండా 59 బంతుల్లోనే 103 పరుగులు చేసి చెలరేగిపోయాడు. అతని ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, 4 భారీ సిక్సర్లు ఉండగా.. కరాచీ వంటి కఠినమైన పిచ్‌పై ఈ ప్రదర్శన మరింత ప్రత్యేకమైంది. బాబర్‌కు తోడుగా మహమ్మద్ హారిస్, కుశాల్ మెండిస్, ఆరోన్ హార్డీ వేగంగా ఆడటంతో జల్మీ 221 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో ఇస్లామాబాద్ 151 పరుగులకే పరిమితమవడంతో జల్మీ సునాయాస విజయాన్ని అందుకుంది. ఈ సెంచరీతో బాబర్ టీ20 క్రికెట్‌లో కెప్టెన్‌గా అత్యధిక శతకాలు చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఇప్పటివరకు 9 సెంచరీలు నమోదు చేసి ఫాఫ్ డుప్లెసిస్ పేరిట ఉన్న 8 శతకాల రికార్డును అధిగమించాడు. ఈ జాబితాలో మైఖేల్ క్లింగర్, విరాట్ కోహ్లీ, జేమ్స్ విన్స్ వంటి స్టార్లు అతని వెనుక నిలిచారు. పీఎస్ఎల్ చరిత్రలో ఇది బాబర్‌కు నాలుగో సెంచరీ. దీంతో ఉస్మాన్ ఖాన్ పేరిట ఉన్న అత్యధిక శతకాల రికార్డును సమం చేశాడు. ఈ సీజన్‌లో అతని పరుగుల ప్రవాహం చూస్తే ప్రత్యర్థి బౌలర్లకు పెద్ద సవాల్‌గా మారాడు. ఇప్పటికే 588 పరుగులతో ఒకే సీజన్‌లో అత్యధిక పరుగుల రికార్డును కూడా అందుకున్నాడు. ఇక ఒకే దేశంలో 8 టీ20 సెంచరీలు సాధించిన ఆటగాళ్ల జాబితాలో బాబర్.. విరాట్ కోహ్లీ, అభిషేక్ శర్మల సరసన చేరాడు. తన ఫామ్‌పై స్పందించిన బాబర్.. తాను మళ్లీ పాత రిథమ్‌ను అందుకుంటున్నానని, కష్టాన్ని నమ్మి సాధన చేసిన ఫలితమే ఇప్పుడు కనిపిస్తోందని చెప్పాడు. మొత్తానికి ఈ ఇన్నింగ్స్‌తో బాబర్ ఆజమ్ మరోసారి ప్రపంచ క్రికెట్‌కు తన స్థాయి ఏమిటో చూపించడమే కాకుండా.. కోహ్లీతో పోలికల్లో తన పేరును మరింత బలంగా నిలబెట్టాడు.



# శేఖర్ కమ్ముల – బాలయ్య కాంబో..



టాలీవుడ్‌లో అరుదైన కాంబినేషన్‌గా భావిస్తున్న శేఖర్ కమ్ముల – నందమూరి బాలకృష్ణ సినిమా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. సున్నితమైన కథలతో ప్రత్యేక గుర్తింపు పొందిన శేఖర్ కమ్ముల, మాస్ ఇమేజ్‌కు కేర్ ఆఫ్ అడ్రస్‌గా నిలిచిన బాలయ్యతో సినిమా చేయబోతున్నాడనే వార్త ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది.ఇటీవల బాలయ్యను కలిసి శేఖర్ కమ్ముల పవర్‌ఫుల్ స్టోరీ వినిపించగా, అది నచ్చడంతో వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ ఏడాదిలోనే ఈ ప్రాజెక్ట్ ప్రారంభమయ్యే ఛాన్స్ ఉంది. ఇక బాలయ్య వరుసగా క్రేజీ డైరెక్టర్లతో సినిమాలు లైన్‌లో పెడుతూ బిజీగా ఉన్నాడు. గోపీచంద్ మలినేని చిత్రం షూటింగ్ కొనసాగుతుండగా, కొరటాల శివ, వివేక్ ఆత్రేయలతో కూడా ప్రాజెక్ట్స్ ప్లాన్ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శేఖర్ కమ్ముల కాంబినేషన్‌పై మరింత ఆసక్తి పెరిగింది.

## 'పెద్ది' కోసం నార్త్ లో పెద్ద ప్లానింగ్ వేశారుగా..!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని జూన్ 4న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నట్టు మేకర్స్ వెల్లడించారు. దీంతో ఈ మూవీ ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.ఇక ఈ సినిమాను నార్త్ బెల్ట్ లో కూడా భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ జియో స్టూడియోస్ ఈ చిత్రాన్ని నార్త్ లో పంపిణీ చేయనుంది. భారీ బడ్జెట్ ఫ్రాంచైజీ 'ధురంధర్'ను విజయవంతంగా అందించిన జియో స్టూడియోస్, ఇప్పుడు 'పెద్ది' చిత్రాన్ని జూన్ 4న హిందీ బెల్ట్‌లో అత్యంత భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సిద్ధమైంది.రామ్ చరణ్‌కు హిందీ ప్రేక్షకులలో విపరీతమైన క్రేజ్ ఉంది. ముఖ్యంగా 'RRR' చిత్రంలో అల్లూరి సీతారామరాజుగా ఆయన కనబరిచిన నటన ఉత్తరాది ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఈ నేపథ్యంలో, 'పెద్ది' చిత్రంలోని బలమైన కంటెంట్ అన్ని భాషల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ ప్రాజెక్టును వెంకట సతీష్ కిలారు నిర్మిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ సమర్పిస్తున్నారు. మరి నార్త్ లో పెద్ది ఎలాంటి ప్రభంజనం సృష్టిస్తుందో చూడాలి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 02.05.2026
www.mudranews.in | @mudranews



**నిమ్మకాయ- పుదీనా నీటిని అలవాటు చేసుకోండి**



విటమిన్ C శరీరానికి ఎనర్జీ ఇస్తుంది, పుదీనా కూలింగ్ ఎఫెక్ట్ ఇస్తుంది.
ఇది శరీరాన్ని ఫ్రెష్‌గా ఉం చి బరువు నియంత్రణకు సహాయపడుతుంది.

# బాలల భరోసా ప్రభుత్వ లక్ష్యం

**- డ్రగ్స్ రహిత తెలంగాణ ముఖ్యమంత్రి లక్ష్యం**

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** బాలల సంరక్షణ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ఆరేళ్ల లోపు పిల్లలు అంగవైకల్యానికి గురికాకుండా చూడాలనే లక్ష్యంతో ప్రభుత్వం బాల భరోసా అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. స్థానిక కలెక్టరేట్ లో శుక్రవారం మే డే వేడుకలతో పాటు బాల భరోసా, నశముక్త్ కార్యక్రమాలు నిర్వహించా రు. ముఖ్య అతిథిగా సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్ల వయసు వచ్చే వరకు చిన్నారులు వివిధ రకాల వ్యాధుల బారిన పడి అంగవైకల్యానికి గురవుతున్నారని తెలిపారు. తెలంగాణ సమాజానికి భవిష్యత్తులో సిబ్బంది జరుగుతుందని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాల భరోసా అనే కార్యక్రమాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సున్నా నుండి ఆరు ఏళ్ల వయసున్న చిన్నారులను వివిధ రకాల పరీక్షలు చేసి లోపాలు ఉంటే మెడికల్ ట్రీట్మెంట్ అందిస్తామన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 18 లక్షల మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా కలెక్టరేట్ లో మహిళ స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల స్టార్స్ ను ఏర్పాటు చేయగా మంత్రి లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు. పలువురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, స్కూటీలు, ఈ ఆటో రిక్షాలను మంత్రి అందజేశారు.

రాష్ట్ర వికలాంగుల సంక్షేమం శాఖ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ దివ్యాంగులకు పరికరాల కొనుగోలు కు రూ. 50 కోట్లు వరకు కేటాయించామన్నారు. రాష్ట్ర వికలాంగుల సంక్షేమం శాఖ డైరెక్టర్ శైలజా మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలకు వచ్చే వ్యాధులను ముందుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ తో పాటు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా వేంకటేశ్వర స్వామి గరుడ సేవ

**ముద్ర, కోరుట్ల:** కోరుట్ల పట్టణంలోని జవహర్ రోడ్ లో గల అతి పురాతనమైన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా గరుడసేవను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బీర్నంది నరసింహచారి ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవమూర్తులకు ఫల, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూలతో అలంకరించారు. స్వామివారు భ లకు గరుడ సేవపై దర్శనం ఇవ్వగా మహిళలు మంగళ హారతులతో, భక్తిశ్రద్ధలతో స్వామి నామస్మరణ చేస్తూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి కైంకర్యదాతలుగా నేతి శ్రీనివాస్ మాధవి దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ యతిరాజం నర్సయ్య, ధర్మకర్తలు నేతి శ్రీనివాస్, కటుకం దివాకర్, కోట గంగాధర్, గోడికే రాములు, చిలువేరి విజయ్, పద్మ, ఈవో విక్రమ్, ఎలిశెట్టి భూమారెడ్డి, పుప్పాల ప్రభాకర్, జూనియర్ అసిస్టెంట్ పెడివెల్లి నర్సయ్య పాల్గొన్నారు.

## రిటైర్డు జడ్జికి సన్మానం

**మహాదేవపూర్, ముద్ర:** పదవీ విరమణ చేసిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్. రమేష్ బాబును శుక్రవారం బార్ అసోసియేషన్, కోర్టు సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి పదిమంది జడ్జి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రమేష్ బాబు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రమేష్ బాబు సతీమణి అనంతలక్ష్మి, ములుగు ప్రధాన న్యాయమూర్తి సూర్యచంద్ర కల, వరంగల్ ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మల గీతాంబ, వరంగల్ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి జే. మైత్రేయి, సీనియర్ సివిల్ జడ్జి టి. కన్హయ్య లాల్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్, గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూనూరు సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

**ముద్ర, కోరుట్ల:** కోరుట్ల పట్టణంలో విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం కోరుట్ల పట్టణం హాజీపూర్ కు చెందిన వావిలాల నవీన్ (28) మున్సిపల్ కార్మికుడు శుక్రవారం ఉదయం ఎల్లమ్మ గుడి దగ్గరలో గల వాగు లో చేపలు పడు తుండగా ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘట నా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాం

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరించిందని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ డిపోలో శుక్రవారం నిర్వహించిన మే డే వేడుకల్లో మంత్రి పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల సింగరేణి కార్మికుల పోరాట ప్రతిమ మరువలేనిద న్నారు. నాడు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే ప్రభుత్వం కనీసం చర్చలకు ఆహ్వానించ లేదనన్నారు. ప్రజలు మార్పు కోరుకున్న ప్రజా ప్రభుత్వంలో ఆర్టీసి కార్మికులు సమ్మె చేస్తే కేవలం మూడు రోజుల్లోనే కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించామని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఐదు గురు మంత్రులు, 24 సంఘాల ప్రతినిధులతో చర్చించి సమ్మెకు ముగింపు పలికామని తెలిపారు. కార్మికుల న్యాయ మైన పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మి కులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జగిత్యాల ఆర్టీసీకార్మి కుల సంఘం గౌరవ అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

**- ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. జగిత్యాల పట్టణంలోని శంకులపల్లి లో శుక్రవారం మేప్మా ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నియోజకవర్గంలో వందకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డువడ్లకు మద్దతు ధర పెట్టినా, ఎఫ్ సీఐ ధాన్యం సేకరణ, కొనుగోలులో మాత్రం జాప్యం చేస్తుందన్నారు. రైతులు సైతం డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి, పౌర సరఫరాల శాఖ మంత్రి ధాన్యం సేకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి చొరవ తీసుకుంటున్నారని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ సమైండ్ల వాణి శ్రీనివాస్, కౌన్సిలర్ లు ఏనుగుల లావ ణ్య రాజు, కూతురు శేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ లు కొలుగురి దామోదర్ రావు, నక్కల రాధా రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ లు తోట మల్లిఖార్జున్, కుసరి అనిల్, జిల్లా యూత్ అధ్యక్షుడు భీరం రాజేష్, సీనియర్ నాయకులు బాలముకుందం, రవీందర్ రావు, రాజు, సాగర్, గంగాధర్, మెప్మా ఏఓ శ్రీనివాస్, టీఎంసీ రజిత, లావణ్య పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించాలి

**- కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా లబ్ధిదారులకు సూచించారు. దిలావర్పూర్ మండలం సిర్గాపూర్ లో మౌనికకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు పూర్తిచేసిన ఇంటి నిర్మాణ పనుల వివరాలు, అయిన ఖర్చు, ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చివరి దశగా మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నిర్మాణాలు నాణ్యంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు తనిఖీ చేయాలని సూచించారు. సంబంధిత యాప్ లో ఆయా దశల్లో ఉన్న నటి నిర్మాణాల ఫోటోలు నమోదు చేయాలని తెలిపారు. లబ్ధిదారులకు సకాలంలో డబ్బులు అందేలా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శంకర్, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, ఎంపీడీవో అరుణ, సర్పంచ్ చైతన్య, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జాతర



**ముద్ర, కోరుట్ల:** జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలోని దుంపేట లక్ష్మీ నరసింహస్వామి జాతరను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి స్వామి వారిని దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో భాగంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. జాతర మహోత్సవంలో భాగంగా శనివారం తెల్లవారు జామున జరిగే రథోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్. వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణం




**బోథ్, ముద్ర:** మండలంలోని కౌట–బి శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం వీర బ్రహ్మేంద్ర స్వామి – గోవిందమాంబల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బోథ్ కు చెందిన వేద పండితులు మల్లేష్ ఈ మహోత్సవం నిర్వహించారు. గురువారం రాత్రి స్వామి వారి రథ యాత్రను గ్రామ పుర వీధుల గుండా అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రథ యాత్ర అనంతరం ఆలయంలో మహారాష్ట్ర నుంచి వచ్చిన ప్రత్యేక భజన బృందాలు ఆలపించిన గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. మూడు రోజుల పాటు కొనసాగిన రథోత్సవ, కల్యాణ మహోత్సవ వేడుకలతో గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కల్యాణ మహోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ వేడుకలకు సహకరించిన వారిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

## ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు..



**ముద్ర, కరీంనగర్:** ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కరీంనగర్ కార్పోరేషన్ కొత్తపల్లి 17 వ డివిజన్ లో పూర్తయిన పెంటి శ్రీలత– శ్రీకాంత్ ఇందిరమ్మ ఇల్లును శుక్రవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలి న లబ్ధిదారులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, గడ్డం శ్రీనివాస్, చిలుక హన్మంత రెడ్డి, గున్నాల రమేష్, చింతల శ్రీనివాస్ రెడ్డి, జేరిపోతుల వాసు, యాస్వాడ రాజకుమార్, కొండం శ్రీనివాస్, సంగం మునిందర్, రాపర్తి రాజు, నాయకులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను హరించొద్దు



**మహాదేవపూర్, ముద్ర:** కార్మికుల హక్కులను కాలరాస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హెచ్చరించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ కార్మికుల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మెగా ఏజెన్సీ 140 మంది కార్మికులు చేయాల్సిన పనులను 70 మందితో నిర్వహిస్తున్నదని, దీనిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ రాహుల్ శర్మ , అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, కార్మిక శాఖ అధికారి వినోద, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, ఐటీఐ ప్రిన్సిపాల్ జుమ్లా నాయక్, సింగరేణి ఏజీఎం ఎర్రన్నతో పాటు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, వెంకటేశ్వర్లు, సతీష్, ఐఎన్టీయూసీ జిల్లా కార్యదర్శి మధుకర్ రెడ్డి, క్యాతం సతీష్, కోలా శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు ఐక్యంగా ఉండాలి



**ముద్ర, కోరుట్ల:** కార్మికులు ఐక్యంగా ఉండాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సూచించారు. కోరుట్ల, మెట్‌పల్లిలో పనిచేస్తున్న కార్మికులకు శుక్రవారం ఎమ్మెల్యే తన సొంత నిధులతో లేబర్, ఇన్స్యూరెన్స్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్యాంకు ఎల్డీఎం రామ్ కుమార్ బీఆర్ ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, కౌన్సిలర్ కొక్కెర వెంకటేష్, నాయకులు జాల వినోద్, టేకుల నరేష్, గడ్డం మధు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 02.05.2026
www.mudranews.in | @mudranews



ఆకలి నియంత్రణ కోసం ఫైబర్ డ్రింక్స్ తీసుకోండి



ఆపిల్ & దాల్చిన చెక్క నీరు తాగితే ఎక్కువసేపు ఆకలి రాదు.
ఇది ఓవర్ ఈటింగ్ తగ్గించి వెయిట్ లాస్‌కు దోహదం చేస్తుంది.

# గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు

**- ఎస్పీ నరసింహ**




**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ నరసింహ హెచ్చరించారు. గంజాయి రవాణా, సరఫరా కేసుల్లో నిందితులుగా ఉన్నవారికి, వినిపిస్తున్న వారికి తల్లిదండ్రుల సమీక్షలో శుక్రవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ల్లా ఎస్పీ నర్సింహ హాజరై నిందితులను ఉద్దేశించి మాట్లాడి, గంజాయి వినియోగం వల్ల జరుగుతున్న అనర్థాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి విని యోగిస్తున్న వారికి పోలీస్ స్టేషన్ నందు డాక్టర్ల సహాయంతో మూత్ర పరీక్షలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నర్సింహ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బాలల రక్షణ డ్రగ్స్ నిర్మూలనపై పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగానే గంజాయి రవాణా వినియోగం కేసుల్లో ఉన్న వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వ హించడం జరిగిందని డాక్టర్ల సహాయంతో మూత్ర పరీక్షలు చేశామన్నారు. డ్రగ్స్ గంజాయి వినియోగించడం వల్ల మత్తులో ఆలోచన విధానం కోల్పోయి నేరాలకు, అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, అనారోగ్యం బారిన పడుతూ భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. కావున ఈ గంజాయిని మన సమాజం నుండి లేకుండా చేయాలి మన పిల్లలను మన సమాజాన్ని ఈ గంజాయి మత్తు నుండి కాపాడుకోవాలని తెలిపారు. గంజాయి వినియోగించిన సరఫరా చేసిన అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సంబంధ కేసుల్లో ఉన్న వ్యక్తులపై పోలీస్ శాఖ పటిష్టంగా నిఘా ఉంచిందని, కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని అన్నారు. ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం వీరుపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డ్రగ్స్ గంజాయి వినియోగం, రవాణా కేసుల్లో చిక్కుకుంటే గరిష్టంగా 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష జరిమానా పడుతుందని తెలిపారు, ఇలాంటి వారిపై పోలీస్ స్టేషన్ల నందు హిస్టరీ సీట్స్ నమోదు చేస్తామని ఐదు లక్షల వరకు బైండోవర్ చేస్తామని పిడి ఆక్ట్ నమోదు చేసి రెండు సంవత్సరాలు జైలుకు పంపడం జరుగు తుందని హెచ్చరించారు. డ్రగ్స్ గంజా లాంటి వాటిని ఇకముందు వినియోగించాలని, రవాణా చేయమని, నిర్మూలనలో భాగస్వామ్యం అవుతామని, సత్ప్రవర్తనతో ఉంటానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, సూర్యాపేట రూరల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, సి సి ఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్ పట్టణ ఎస్ఐలు ఏడుకొండలు, శివ తేజ, మహేందర్ నాథ్, సాయిరాం, వెంకన్న, సూర్యాపేట రూరల్ సర్కిల్ ఎస్సైలు శ్రీకాంత్ గోపికృష్ణ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ముద్ర, బీబీనగర్ :** బీబీనగర్ మండలం ముగ్దంపల్లి గ్రామంలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు సర్పంచ్ శిగ నరేష్ గౌడ్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన నాశబోయిన లక్ష్మి, మట్ట సత్తయ్య, శెట్టి మనోహర్ అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం కోసం ఖర్చు పెట్టుకున్న డబ్బులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో 1,76,000 రూ, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శెట్టి మహేష్, గ్రామ శాఖ అధ్యక్షులు క్యాసాని కొండల్, శెట్టి మల్లేష్, బండారు పేద వాతి, కృష్ణ, బాలరాజ్ పాల్గొన్నారు.

## సమావేశానికి ప్రజలు అధిక సంఖ్యలో రావాలి

**- కలెక్టర్ అనురాగ్ జయంతి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశానికి రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించుకోవాలని యాదాద్రి భువనగిరి కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9.30 గంటలకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో బాగంగా ప్రభుత్వ ప్రధాన పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రెండు నియోజకవర్గాల్లో కార్యక్రమాలు చేపట్టమన్నారు. భువనగిరి నియోజకవర్గంకు సంబంధించి రాయగిరి లోని సోమరాధ ఫంక్షన్ హాల్లో, ఆలేరు నియోజకవర్గం కు సంబంధించి ఆలేరులో ఇమ్మడి నర్సింహ రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు

## ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

**- కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్**

**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ సూచించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా సూర్యాపేట కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్ లో శుక్రవారం మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల కృషిని కొనియాడుతూ, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు,



ఇండస్ట్రియల్ యజమానులు, విద్యార్థులకు కలెక్టర్ షీల్డ్ లు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి జానీ పాషా, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్. మానస, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపాల్ శ్రీరాములు, వివిధ శాఖల అధికారులు, కార్మిక నాయకులు, పరిశ్రమల యాజమానులు, కార్మికులు పాల్గొన్నారు.

## కార్మికులు నైపుణ్యాలు పెంచుకోవాలి

**- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** కార్మికులు నైపుణ్యాలు పెంచుకోవాలని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మే డే వేడుకలకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కార్మికుల హక్కులు, భద్రత, సంక్షేమాన్ని నిర్ధారించడానికి కార్మిక చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడం ప్రాముఖ్యతను క్లుప్తంగా వివరించారు. ఐటీఐ, ఏటీసీ శిక్షణా కార్యక్రమాల కింద, యువతలో నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహిస్తూ, శిక్షణార్థులకు యూనిఫాం మద్దతుతో పాటు నెలకు ₹2000 స్టైఫండ్ అందిస్తున్నారన్నారు. జిల్లా ఉపాధి కార్యాలయం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, వృత్తి మార్గదర్శకత్వం కల్పించడంలో చురుకుగా పనిచేస్తోందన్నారు. డిఆర్ఓ జయమ్మ, ఆర్డీవో కృష్ణారెడ్డి, క్రీడా, యువజన శాఖ అధికారి ధనంజనేయులు, జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితి, ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి, ఈఎస్ఐ డాక్టర్, సహాయ కార్మిక అధికారి, హరికృష్ణ, ఐఎన్టీయూసీ, ఎలక్ట్రీషియన్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మోడీ పాలనలో కార్మికుల బతుకులు చిన్నాభిన్నం

**- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండీ జహంగీర్**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** మోడీ పాలనలో కార్మికుల బతుకులు చిన్నాభిన్నం అయ్యాయని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండీ జహంగీర్ ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా పార్టీ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. పుచ్చలపల్లి సుందరయ్య జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి



అనురాధ, జిల్లా కార్యవర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రా రెడ్డి, మాయ కృష్ణ, ప్రజాసంఘాల జిల్లా నాయకులు ఈర్లపల్లి ముత్యాలు, లావుడియా రాజు , గద్దె నరసింహ, పాల్గొన్నారు.

### అసమానతలు పోవాలి..

సమాజంలో అసమానతలు పోవాలని సీపీఎం హనుమన్వాడ శాఖ కార్యదర్శి బర్ల వెంకటేష్ పేర్కొన్నారు. హనుమాన్ వాడలో ఎర్రజెండాను ఎగరవేశారు.

## వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రత పూజలు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** శబరి నగర్ లోని శ్రీ హరి హరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రత పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అయిత రాములు, ప్రధాన అర్చకులు నరేందర్ శర్మ, నిత్య అర్చకులు జితేందర్ తివారి ఆధ్వర్యంలో శ్రీ రమ సహిత సత్యనారాయణ స్వామికి పంచామృతాలు, తేనె, నెయ్యి, పాలు, చక్కెర, డ్రై ఫ్రూట్స్ కాజు, బాదం, కిస్మిస్ లు, కొబ్బరి నీళ్లతో అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు పసుపునూరి నాగభూషణం, రామాచారి, లక్ష్మీనారాయణ, చెన్న ప్రవీణ జిల్లా వెంకటరమణ దంపతులు, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ గాదె శ్రీనివాస్, కో చైర్మన్ పోకల సోమన్న, ఆర్గనైజింగ్ సెక్రెటరీ చీకటి మల్ల రాములు, ఆలయ ట్రెజరర్ శ్యాంసుందర్ ఘటాని, మాజీ అధ్యక్షుడు పసునూరి నాగభూషణం, జిల్లా వెంకటరమణ, అల్లే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రసాయన ఎరువులు అధికంగా వాడొద్దు




**ముద్ర, తుంగతుర్తి:** రైతులు పరిమితికి మించి రసాయన ఎరువులు వాడితే పంటల దిగుబడి పై ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు సుకుమార్, శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గొట్టిపర్తి రైతు వేదిక క్లస్టర్ లో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రసాయన ఎరువుల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువులు, యూరియా అధిక మొత్తంలో వినియోగించడం వల్ల భూములు నిస్సారమవుతున్నాయని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా నేల స్వభావం, భూసారాన్ని బట్టి ఎరువులు వాడాలని సూచించారు. కానీ రైతులు దీనికి విరుద్ధంగా ఒకే రకమైన ఎరువులు వాడుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు సాగు మెలకువలపై అవగాహన కల్పించారు, రసాయనన పిచికారితో ప్రాణాపాయం కలగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, నూతన వరి వంగడాల విశిష్టత, సేంద్రియ సాగు, వ్యవసాయం ప్రాధాన్యతపై రైతులకు అవగాహన కల్పించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంట మార్పిడి చేపట్టాలని సూచించారు. సాగునీటిని పొదుపుగా వినియోగిస్తూ ముందస్తు ప్రణాళికలతో సాగు చేయాలని కోరారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, సర్పంచ్ చిలుకల మంజుల, ఉప సర్పంచ్ శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణాధికారి జోష్ణ తో పాటు రైతులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు



**ముద్ర, బీబీనగర్:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీబీనగర్ మండలం రుద్రవెల్లి , పల్లెగూడం, వెంకిర్యాల, మక్త అనంతారం, పడమటి సోమారం గ్రామాల్లో పిఏసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలని వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, తాసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి , పీఏసీఎస్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొట్టోల శ్యామ్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సంధిగారి బసవయ్య, సింగిల్ విండో డైరెక్టర్లు చింతల శ్రీనివాస్ రెడ్డి, పంజాల సత్తయ్య గౌడ్, రాఘవపురం సర్పంచ్ సిద్దగోని శ్రీకాంత్ గౌడ్, రుద్రవెల్లి సర్పంచ్ జిల్కపల్లి సరళ అశోక్ రెడ్డి, పల్లెగూడం సర్పంచ్ అప్పారెడ్డి బలరాం రెడ్డి , మక్త అనంతరం సర్పంచ్ ధర్నాబోయిన కిలందర్ ,వెంకిర్యాల సర్పంచ్ చింతల నాగలక్ష్మి లక్ష్మీనారాయణ, పడమటి సోమారం సర్పంచ్ బద్దం అంజయ్య , ఉపసర్పంచులు , ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు..

## రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

**బీబీనగర్, ముద్ర:** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొట్టోళ్ల శ్యామ్ గౌడ్, అధికారులను ఆదేశించారు. రుద్రవెల్లి, పల్లెగూడెం, వెంకిర్యాల, మక్త అనంతారం, పడమటి సోమారం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారం భించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మెట్టు శ్రీనివాస రెడ్డి, వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, పీఏసీఎస్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ లతో కలిసి ప్రారంభించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 02.05.2026
www.mudranews.in | @mudranews

పశ్చిమ తెలంగాణ
మెదక్, నిజామాబాద్
Medak, Nizamabad

సిట్రస్ ఫ్రూట్స్‌తో
మెటాబాలిజం పెంచండి

గ్రేప్‌ఫ్రూట్, ఆరెంజ్ వాటర్ శరీరంలో ఫ్యాట్ బర్న్‌ను పెంచుతుంది.విటమిన్ C అధికంగా ఉండడం వల్ల ఎనర్జీ లెవల్స్ కూడా మెరుగుపడతాయి.



## ఏడుపాయలలో పల్లకి సేవ



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఏడుపాయల వన దుర్గ మాత సన్నిధిలో పౌర్ణమి పురస్కరించుకొని పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి ఆలయం నుండి రాజగోపురం మీదుగా పల్లకి సేవ నిర్వహించారు. వన దుర్గ మాతాకీ జై అంటూ అమ్మవారి నామస్మరణ మారు మ్రోగింది. ఆలయ అధికారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పిరమిడ్ కేంద్రంలో అఖండ ధ్యానం



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతన్ శెట్టిపల్లి గ్రామంలో పంచాక్షరి మహా శక్తి పిరమిడ్ కేంద్రంలో 24 గంటల పాటు ధ్యానం నిర్వహిస్తున్నారు. బుద్ధ పౌర్ణమి పురస్కరించుకొని పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో పంచాక్షరి పిరమిడ్ మాస్టర్ అనసూయమ్మ మాట్లాడుతూ సర్వ మానవులలో ఒకే ఆత్మ ఉందని గౌతమ్ బుద్ధుడు చెప్పారని గుర్తు చేశారు. పత్రీజీ ఆశయ సాధనలో భాగంగా శ్వాస మీద ధ్యాస పెడితే ప్రతి ఒక్కరికి జీవిత సత్యాలు అర్థమవుతాయని ఆమె తెలియజేశారు. బుద్ధం శరణం గచ్చామి అంటూ అందరికీ బుద్ధుని గురించి వివరించారుఈ కార్యక్రమంలో సురేందర్, పట్లోళ్ల రామకృష్ణ, నాగరాజు, సంగాయిపేట్ వీరేశం, ఆలూరి అనిత, జోగిపేట చెందిన సత్యమ్మ, పొడిచిన పల్లి సంతోష, లక్ష్మి, చౌటకురు పిరమిడ్ మాస్టర్ అనసూయ, పుష్ప తదితరులు అఖండ ధ్యానంలో పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ ప్రతిమా సింగ్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** నీట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలిజిల్లాలో మొత్తం 479మంది అభ్యర్థులు కలెక్టర్ ప్రతిమా సింగ్ముద్ర ప్రతినిధి, మెదక్:నీట్ పరీక్ష ఎలాంటి తప్పిదం లేకుండా జిల్లాలో పకడ్బందీగా నిర్వహిం చేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. 3న నిర్వహించనున్న నీట్ పరీక్షకు జిల్లాలో మొత్తం 479మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలో నీట్ నిర్వహించే పరీక్ష కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, గతేడాది మాదిరే పరీక్షలను సజావుగా నిర్వహించాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్ లోనీ నిబంధనలను పూర్తిగా అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా పరీక్ష రాసేందుకు రావాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి విధిగా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. పరీక్షా కేంద్రంలో సిఎస్, అబ్జర్వర్లు, ఇతర సిబ్బందితోపాటు తహసిలార్ స్థాయి అధికారులు, ఎస్సై, ఒక గన్మెన్, నలుగురు కానిస్టేబుల్స్ తో కూడిన పోలీసులు విధులు నిర్వహిరిచాలన్నారు. ఆయా కేంద్రాల వద్ద163 బి.ఎన్.ఎస్ అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద విద్యుత్ సౌకర్యం, సీసీ కెమెరాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, తదితర అన్ని ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ సకాలంలో బస్సులను నడపాలన్నారు. దివ్యాంగ అభ్యర్థులకై అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రాథమిక వైద్యం, అంబులెన్స్, ఫైర్ వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఎంతో ప్రాధాన్యతతో కూడిన నీట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. నీట్ పరీక్ష రాసే అభ్యర్థులకు సూచనలు సలహాలు అందించారు.సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, చేతి గడియారాలు, బ్లూటూత్ పరికరాలు, బ్యాగులు, కాలిక్యులేటర్లు పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడవు.పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5:.00 గంటల వరకు ఉంటుంది.పరీక్ష రాసే అభ్యర్థులను ఉదయం 11 గంటల నుండి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు.అభ్యర్థులు మధ్యాహ్నం 1:30 గంటలలోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. 1:30 తర్వాత లోనికి అనుమతించరు.అడ్మిట్ కార్డు, ఫోటో ఐడి ప్రూఫ్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో తప్పనిసరిగా వెంట తీసుకు వెళ్ళాలి.మడమలు తక్కువగా ఉన్న చెప్పులు ధరించాలి. షూస్ ధరించ కూడదు.మెడలో గొలుసులు, ఉంగరాలు, చెవి కమ్మలు, ముక్కు పుడకలు వంటి లోహ ఆభరణాలు ధరించకూడదు.

# కార్మిక హక్కులు కాపాడేది ఎర్రజెండానే

**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తాం**

**రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆముదాల మల్లారెడ్డి**




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** కార్మిక హక్కులను కాపాడేది ఒక ఎర్ర జెండా మాత్రమేనని నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల తిప్పికొట్టేది ఏకైక జెండా ఎర్రజెండా అని అందుకు కార్మిక వర్గం ఐక్యతతో మేడే స్ఫూర్తితో పోరాటాలను ఉదృతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆముదాల మల్లారెడ్డి అన్నారు.శుక్రవారం ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ముస్తాబాద్ చౌరస్తా నుండి బి జి ఆర్ చౌరస్తా మీదుగా కార్మిక కర్షక భవనం వరకు బైకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక హక్కులను కాపాడుతామంటూ అన్ని పార్టీల అనుబంద కార్మిక సంఘాలు ఊకదోపుడు ఉపన్యాసం చేస్తుంటాయి కానీ ఆచరణలో పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడడానికి మాత్రమే బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఉన్నాయని అన్నారు. అందుకు ఉదాహరణ కేంద్రంలో ప్రభుత్వం ఉన్న బిజెపి పార్టీ తన అధికార బలంతో కార్మిక వర్గానికి ఉన్న 29 చట్టాలు రద్దుచేసి వాటి స్థానంలో కార్మిక వర్గ హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చింది దీని ఫలితంగా మేడే స్ఫూర్తిగా చెప్పుకుంటున్న ఎనిమిది గంటలకు పని నేటి నుండి అంత మవుతుందన్నారు. అలాగే పని భద్రత లేదు సామాజిక భద్రత ఉండదు pf లేదు ఈఎస్ఐ లేదు జీతం ఇచ్చింది తీసుకునే విధంగా బానిస లాగా బతకాలని విధానం బిజెపి ప్రభుత్వం తెస్తే రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని వ్యతిరేకించకుండా అసలు అసెంబ్లీ సమావేశంలో లేబర్ కోడ్ ల రద్దు కోసం తీర్మానం చేసి పంపకుండా దొంగ దారిన వాటిని బలపరిచే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పోడుకుంటుంది అలాగే తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలు పరిపాలన చేసిన బిఆర్ఎస్ సైతం కార్మిక హక్కులను హరించి వేసిందని పర్మనెంట్ చేస్తామని జీతాలు పెస్తామని అనేక వాగ్దానాలు చేసిన గత ప్రభుత్వం సమ్మెలు చేయకుండా సంఘాలు లేకుండా కొట్లాడే జాగలేకుండా కుట్రపల్లిన టిఆర్ఎస్ కూడా లేదు ప్రపంచ కార్మిక దినోత్సవం జరపడం అంటే కార్మికులను మోసం చేయడం తప్ప మరోటి కాదని ఇలాంటి మోసపూరిత విధానాలను ప్రజలు కార్మిక వర్గం అప్రమత్తంగా ఉండి కార్మిక వర్గ చైతన్యంతో పెట్టుబడుదారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడినపుడు మాత్రమే మే డే స్ఫూర్తితో మనం ముందుకు సాగుతామని ఈ సందర్భంగా ఆయన అన్నారు. అందుకు సిఐటియు కార్మిక వర్గ ప్రయోజనాలు కాపాడే దాంట్లో దేశవ్యాప్తంగా ముందు బాగాన నిలబడిందని రాబోయే కాలంలో మరిన్ని పోరాటాలను ఐక్య విశాల ఉద్యమాలు నిర్మిస్తారని ఈ సందర్భంగా తెలిపారు ఈ మేడే కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గోపాల్ స్వామి మాట్లాడారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వర్గ వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం చైతన్యంతో పోరాడాల్సిన అవసరం నేడు ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శులు చొప్పరి రవికుమార్, సింగిరెడ్డి చంద్రారెడ్డి, మామిడాల కనకయ్య సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కాటం మధు మెడికల్ రిపెండెంట్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విద్యాసాగర్ జిల్లా నాయకులు రామ్ రెడ్డి ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు జిల్లా అధ్యక్షులు అశోక్ ,కనకరాజు, సుధాకర్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గుర్రం నరసింహులు జిల్లా గౌరవ సలహాదారులు ఎర్ర మల్లయ్య హమాలి యూనియన్ నాయకులు భూపతి రెడ్డి రాజిరెడ్డి మహేష్ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రవర్కర్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల వెంకటయ్య ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి జాలిగా శిరీష, యువజన సంఘం నాయకులు కొండం సంజు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తుల అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై పోరాటం

**సిఐటీయు జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా కేంద్రంలో మేడే వేడుకలు సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయం కేవల్ కిషన్ భవన్, మున్సిపల్ కార్యాలయం, ఎంసిహెచ్ హస్పిటల్, రైల్వే స్టేషన్, భవన నిర్మాణ కార్మికుల అడ్డ, పాక్స్ గోదాం వద్ద సిఐటియు జెండాలు ఆవిష్కరణ చేశారు. అనంతరం పోస్టాపీసు దగ్గర సభ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ... కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం అధికారానికి వచ్చిన గత 12 సంవత్సరాల నుండి కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం పోరాడి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్ ను తీసుకొచ్చింది. తీవ్ర నష్టం కలిగిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక కార్మిక వర్గం ఐక్యతగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి జే.సంతోష్, వికలాంగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గ, నాయకులు షౌకత్, మున్సిపల్ యూనియన్ కార్మికులు రాజశేఖర్, ఏసు, మల్లేశం, శోభ, ఎల్లవ్వ, ఉషవ్వ, పోచమ్మ, శేఖర్, అంజి, హమాలీ కార్మికులు బాల్ నర్సు, మల్లేశం, గట్టయ్య, బాలు, ఆంజనేయులు, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలోతెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే కార్మికుల దినోత్సవం నిర్వహించారు. మెదక్ సర్కిల్ కార్యాలయం ముందు జిల్లా అధ్యక్షులు అశోక్ కార్మిక జెండాను ఆవిష్కరించారు.కార్మికులు తమ హక్కుల సాధన కోసం రక్తం చిందించి సాధించిన చారిత్రాత్మక దినమని పేర్కొన్నారు. ఉస్మాన్, సాయిలు, తోఫిక్ అలీ, వెంకటేశం, బిక్షపతి, అజీజ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శిశువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

**కలెక్టరేట్ లో దత్తత సహాయక కేంద్రం ప్రారంభించిన కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** శిశువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. కన్న పిల్లలను పెంచి పోషించలేని వారు, వద్దనుకునే వారు చెత్త కుప్పల్లో, చెట్ల పొదల్లో వేయకూడదని ప్రభుత్వానికి అప్పగించడం ద్వారా చట్టబద్ధంగా దత్తత ఇస్తామని పేర్కొన్నారు. సమీకృత కలెక్టరేట్ లో మహిళా, శిశు, సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో దత్తత సహాయ కేంద్రం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ...ప్రతి సోమవారం జరిగే ప్రజా వాణి రోజున కలెక్టరేట్ ప్రాంగణానికి వచ్చే ప్రజలకు హెల్ప్ డెస్క్ ద్వారా దత్తత ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారం, అవసరమైన పత్రాలను, ప్రభుత్వ మార్గదర్శకాలు వంటి అంశాల సమాచారం కోసం ప్రజలకు ఉపయోగపడేలా దత్తత సహాయక కేంద్రం ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ సంవత్సరం మొత్తం 11 అక్రమ దత్తత ఆపడం జరిగిందని, 5 ఎఫ్ఐఆర్ ఫైల్ చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు మాట్లాడుతూ.. చిన్నపిల్లలను దత్తత తీసుకునేవారు చట్టంలో ఉన్న నిబంధనలకు లోబడి వ్యవహరించాలన్నారు. దత్తత సహాయ కేంద్రం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం దత్తత పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది. డిఆర్డిఓ శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, డీపీఓ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంకార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. కార్మికుల కష్టాలను గుర్తిస్తూ, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కలెక్టరేట్ లో 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో మేడే వేడుకలు – 2026ను ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ నగేష్, కార్మిక శాఖ సహాయ కమిషనర్ సాహితి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య పాల్గొన్నారు. యువత సాధికారతకు కెరీర్ గైడెన్స్యువత సాధికారతకు కెరీర్ గైడెన్స్ ఎంతో దోహద పడతాయి కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఉన్నత చదువుల కోసం సరైన స్ట్రీమ్ ఎంపిక చేసుకోవాలన్నారు. జిల్లా గ్రంథాలయంలో కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సుకు హాజరయ్యారు. గ్రంథాలయ చైర్ పర్సన్ చిలుమల సుహాసిని రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ యువకులు పాల్గొన్నారు. కెరీర్ గైడెన్స్ పై యువతకు పలు సూచనలు సలహాలు అందించారు. యువతకు కెరీర్ తాను ఎంచుకున్న రంగంలో నాణ్యమైన గుణాత్మక విద్య ద్వారా ఉన్నత శిఖరాల అధిరోహించాలని ప్రతి విద్యార్థి జీవితంలో ఏదో ఒకసారి ఓటమి అనేది తలుపు తడుతుందని ఎవరు అధైర్య పడవద్దు అన్నారు.

## రైతు ఆత్మహత్యాయత్నం



**ముద్ర, నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లెలో ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతు డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద పడికాపు కాస్తున్నా ధాన్యం కొనడం లేదని ఆరోపిస్తూ ఎల్లారెడ్డి పల్లి సర్పంచ్ భర్త మఠంల శేఖర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన పోలీసులు అతడిని అడ్డుకున్నారు. కాగా గ్రామ రైతులు రోడ్డుపై ధాన్యం పోసి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల ఆందోళన భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## ఉచిత ఖత్నా క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** ఈ నెల 6న ఉచిత సామూహిక సున్నతులు (ఖత్నా ) క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట తంజీమూల్ –మసాజిద్ సుప్రీం బాడీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖాదర్ తెలిపారు. శుక్రవారం సిద్దిపేట లో వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా సిద్దిపేట లొని మదీనా ఫంక్షన్ హాల్లో ఖత్నా క్యాంపు నిర్వహిస్తున్నమాన్నారు. గతంలో మిల్లతే ఇస్లామియా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వాహజంచేవారమని ఈ సంవత్సరం సిద్దిపేట తాంజీముల్ మసాజిద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. క్యాంపు కు వచ్చే వారికి మధ్యాహ్నం లంచ్ కూడా ఉంటుందని తెలిపారు. ఖత్నా చేయడానికి హైదరాబాద్ నుండి ప్రాఖ్యాత డాక్టర్స్ రానున్నారని తెలిపారు. సిద్దిపేట తో పాటు చుట్టూ పక్కన ఉన్న గ్రమాలు పట్టణాల వారు సద్వినియోగం చేసుకోవలన్నారు.మరిన్ని వివరాలకు 9989484657 సంప్రదించలన్నారు.కార్యక్రమంలో సుప్రీం బాడీ అధ్యక్షులు జుబెర్,తంజీమ్ అధ్యక్షులు ఆసిఫుద్దీన్, ఉపాధ్యక్షులు ఉబెద్,సభ్యులు ఎత్తే శ్యామ్,నవెద్, కలీం, సజ్జు, రియాజ్ పాల్గొన్నారు.